సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక 31-7-2026 ₹ 15/-

జంతర్ మంతర్

గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 31 హైదరాబాద్
శుక్రవారం 31 జూలై 2026 రూ.15-00
సఫర్ 16 1448 హిజ్రీ

తొలిగీటు

వ్యాపారంలో దైవభీతితో మెలిగినవారు, రుజువర్తనులు, సత్యసంధులు తప్ప మిగతా వ్యాపారులు ప్రళయ దినాన దుష్టులు, దురాచారుల స్థలిలో నిలబెట్టబడతారు. *(బుఖారీ)*

సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్

అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్

ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్

గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్

సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com

లోపల...

అబద్ధాల యుద్ధాలు	......	04
జంతర్ మంతర్	......	05
"బ్రిటిష్ రెసిడెన్సీ"పై దాడి జరిపిన ప్రజా యుద్ధ యోధులు	......	11
జంతర్ మంతర్‌లో జ్వలిస్తున్న యువశక్తి!	......	14
వైవాహిక జీవితం: హక్కులు – బాధ్యతల సమతుల్యత	......	16
వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం)	......	18
అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం)	......	19
భారత దేశంలో సమకాలీన సామాజిక సమస్యలు - 3	......	20
మెదడు సంరక్షణ – ముఖ్యాంశాలు	......	23
మాటల వరదలో... నిశ్శబ్ద తీరాలు	......	24
అవినీతి అనర్థాలు	......	26
ఆధునిక సామాజిక రుగ్మత... 'కోపం'!	......	28
అర్ధరాత్రి స్క్రోలింగ్ నిద్రలేని జీవితం	......	31
సంక్షిప్త భారతం	......	32
సర్వత్రా	......	33
దాన గుణం స్వర్గానికి మార్గం!	......	34

న్యాయం కోసం...

ప్రజాస్వామ్య దేశంలో
ప్రశ్నించడమే నేరమా
మోడి షాల పాలనలో
మరీ ఇంత ఘోరమా!!

ఎలాగైనా(అ)ధర్మేంద్ర
చెయ్యాలి రాజీనామా
న్యాయం దక్కే వరకు
పోరే మా చిరునామా!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

అబద్ధాల యుద్ధాలు

అమెరికా డిఫెన్స్ సెక్రటరీ పీట్ హెగ్సెత్ ఈరాన్‌తో జరుగుతున్న యుద్ధంపై కాంగ్రెస్ ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చాడు. నాలుగు నెలల పోరాటం తర్వాత గొప్పగా కాల్పుల విరమణ ప్రకటించారు కాని, కాల్పుల విరమణ పత్రం సిరా ఆరకముందే దాన్ని తుంగల్లో తొక్కి మళ్ళీ యుద్ధానికి దిగారు. ఇప్పుడు అమెరికా దాడులకు ఈరాన్ దీటుగా జవాబిస్తోంది. పీట్ హెగ్సెత్ ఈరాన్ యుద్ధం "ప్రధాన లక్ష్యం" గురించి చెప్పే మాట ఈరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడం. యుద్ధం ప్రారంభమైన రోజు నుండి చేస్తున్న ప్రకటన ఇది. కాని ఈ ప్రకటన చేస్తున్న వారు కూడా ఇప్పుడు ఈ మాటలు నమ్మే పరిస్థితి లేదు.

అమెరికా చేస్తున్న యుద్ధానికి ఈరాన్ అణు కార్యక్రమానికి సంబంధం లేనే లేదన్నది ఇప్పుడు అందరికీ అర్థమవుతున్న వాస్తవం. యుద్ధం ప్రారంభం నుంచి అమెరికా సైనిక దాడులు ప్రధానంగా ఈరాన్ నాయకత్వం లక్ష్యంగా జరిగాయి. ఈరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడం లక్ష్యంగా దాడులు జరిగాయి. ఈరాన్ అణు సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడులు చాలా తక్కువ.

అమెరికా రహస్య నివేదికలను ఉటంకిస్తూ, గతేడాది వేసవిలో అమెరికా, ఇస్రాయిల్ విమానాలు ఈరాన్ అణు రియాక్టర్లు, శుద్ధి కేంద్రాలపై దాడి చేసినప్పటికీ ఈరాన్ అణు సామర్థ్యంలో పెద్దగా మార్పు ఏమీ లేదని రాయిటర్స్ మే నెలలో నివేదించింది. గత జూన్‌లో అమెరికా–ఇస్రాయిల్ దాడులు ఈరాన్ అణు కార్యక్రమాన్ని "పూర్తిగా తుడిచిపెట్టేశాయని" అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పాడన్నది కూడా గుర్తుంచుకోవాలి. వాస్తవాలు ఇలా ఉన్నప్పటికీ, ట్రంప్, హెగ్సెత్ ఇద్దరు కూడా ఈరాన్ అణు ఆకాంక్షల గురించి పదేపదే అబద్ధాలు చెప్పడం మానలేదు. ఈరాన్ అణు కార్యక్రమాన్ని పునఃప్రారంభించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని చెప్పారు. కానీ ఈ మాటలను అమెరికా నిఘా వర్గాలు, ట్రంప్ ప్రభుత్వ అధికారులు కూడా ఖండించారు.

యుద్ధం ప్రారంభం కావడానికి ముందు, ఈరాన్ అణు ఇంధనాన్ని శుద్ధి చేయడం లేదని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చెప్పారు. ఇంకా వెనక్కి వెళితే, మే 2025లో, అప్పటి జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసి గబ్బార్డ్ కాంగ్రెస్‌తో మాట్లాడుతూ, "ఈరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయడం లేదు. 2003లో నిలిపివేసిన అణ్వాయుధ కార్యక్రమానికి సుప్రీం లీడర్ ఖమేనాయి అనుమతి ఇవ్వలేదు" అని చెప్పారు. యుద్ధానికి ముందు చర్చలు జరుగుతున్నప్పుడు మాత్రం అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఒక సందర్భంలో ఈరాన్ "వారం రోజుల్లో ఈరాన్ బహుశా బాంబు తయారు చేయవచ్చు" అన్నట్లు మాట్లాడాడు. కాని ఈ మాటలు నమ్మశక్యం కానివని అప్పట్లోనే చాలా మంది అభిప్రాయపడ్డారు.

20 ఏళ్ల క్రితం బుష్ ఇరాక్‌పై యుద్ధానికి తీసుకున్న దురదృష్టకరమైన నిర్ణయం వంటిదే ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం. అణ్వాయుధాలనేవి ఒక సాకు మాత్రమే. ఇస్రాయిల్ అడుగులకు మడుగులొత్తుతూ ప్రారంభించిన యుద్ధం ఇది. ట్రంప్ యుద్ధం గురించి అమెరికా ప్రజలకు అబద్ధాలు చెబుతున్నాడు. ప్రపంచానికి అబద్ధాలు చెబుతున్నాడు. ఇప్పుడు కూడా హెగ్సెత్ ఈరాన్‌తో యుద్ధం కోసం $70 బిలియన్ల నిధులు కావాలని కాంగ్రెస్‌ను అడిగాడు. ఎందుకంటే ఈరాన్ అణ్వాయుధాలను అడ్డుకోడానికి అన్నాడు.

జూలై 8 నుండి, అమెరికా దళాలు దాదాపు ప్రతిరోజు ఈరాన్‌పై దాడులు చేస్తున్నాయి. అయితే, మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక కార్యకలాపాలను నిర్వహించే యు.ఎస్. సెంట్రల్ కమాండ్ విడుదల చేసిన ప్రకటనల ప్రకారం, అమెరికా దాడుల ప్రధాన ఉద్దేశం "హోర్ముజ్ జలసంధి" గుండా వెళ్ళే వాణిజ్య నౌకలపై ఈరాన్ నిరంతరం దాడులు చేసే సామర్థ్యాన్ని దెబ్బతీయడం. ఈరాన్ అణ్వాయుధ ముప్పును తొలగించడం కాదు.

ఈరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, కమాండ్–అండ్–కంట్రోల్ నెట్‌వర్క్‌లు, తీరప్రాంత రాడార్, ఇతర నిఘా సామర్థ్యాలు, క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, భూగర్భ కేంద్రాలు, నావికాదళ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. అమెరికా సైనిక దాడులు ఈరాన్ అణు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు కనబడడమే లేదు. ఈరాన్ వద్ద అణుబాంబు అనేది లేనే లేదన్నది స్పష్టం. హోర్ముజ్ జలసంధిని ఈరాన్ దిగ్బంధించకుండా నిరోధించడంపై మాత్రమే అమెరికా దృష్టి పెట్టింది. యుద్ధానికి ముందు లేని సమస్య ట్రంప్ ఈ యుద్ధంతో కొని తెచ్చుకున్నాడు. అణుబాంబు లేకపోయినా ఈరాన్ తన సైనిక సామర్థ్యంతో అమెరికాను ముప్పుతిప్పలు పెడుతోంది.

అమెరికా గనుక ఈరాన్‌పై దాడి చేయకపోతే పర్షియన్ గల్ఫ్‌లో నౌకాయానం యథావిధిగా సాగేది. యుద్ధానికి వెళ్లడం వల్ల జలసంధి మూతపడటం, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు విపరీతంగా పెరగడం, పదుల బిలియన్ల సైనిక ఖర్చులు అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోవడానికి దారితీసింది. ఈ యుద్ధం ఎవరి కోసం? ఇస్రాయిల్ కోసం. అమెరికా సైనికులు చస్తున్నది ఇస్రాయిల్ కోసమన్నది ఇప్పుడు అమెరికా ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమవుతోంది.

హెగ్సెత్ తదితరులు ఏం చెప్పినా, ఈరాన్ అణ్వాయుధాలను అడ్డుకోడానికి అమెరికా యుద్ధం చేస్తుందన్నది పచ్చి అబద్ధమని అమెరికన్లు నమ్మడం ఎక్కువయ్యింది. ఇస్రాయిల్ కోసం ట్రంప్, హెగ్సెత్ యుద్ధానికి వెళ్లారు. ఇప్పుడు పరిస్థితి నియంత్రణ తప్పిపోవడంతో, అమెరికన్ ప్రజలకు యుద్ధం గురించి అబద్ధాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నెతన్యాహు యుద్ధనేరస్తుడు కాబట్టి ఆయన న్యూయార్క్ వస్తే అరెస్టు చేస్తామని ప్రకటించిన న్యూయార్క్ మేయర్ మమ్దానీ, ఒక నగర మేయరుగా తనకు ఆ అధికారాలు లేవని, కాని ఫెడరల్ ప్రభుత్వం ఈ అధికారాలు ఉపయోగించి అరెస్టు చేయాలని చెబుతున్న మాటలు కూడా గమనార్హమైనవి. మమ్దానీ చెబుతున్న మాటలు అమెరికా ప్రజలపై ఎలాంటి ప్రభావం వేస్తాయి? గాజాలో ఇస్రాయిల్ మారణహోమం వార్తలు, ఈరాన్ యుద్ధంలో ట్రంప్ చెప్పిన అబద్ధాల ప్రభావం ఎలా ఉంటుందో రానున్న ఎన్నికల్లో తెలుస్తుంది. ఈ లోగా బహుశా అమెరికా పశ్చిమాసియాలో పట్టు కోల్పోయే పరిస్థితులు రావచ్చు. ✤

అబ్దుల్ వాహెద్

జంతర్ మంతర్

పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలపై ఆన్‌లైన్‌లో మొదలైన ఆగ్రహం, యువతను నిర్లక్ష్యం చేసే వ్యవస్థపై ఆఫ్‌లైన్ ప్రతిఘటనగా శరవేగంగా మారిపోయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలనే వరకు వెళ్ళింది.

పదేపదే జరుగుతున్న పరీక్షా పత్రాల లీకేజీలు, ఆత్మహత్యలు, వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ ఈ నిరసనల్లో ముఖ్యంగా వినబడుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత పన్నెండేళ్ల రికార్డుపై ఆగ్రహంగా మారుతోంది. యువత నేరుగా మోదీ పాలనను ప్రశ్నిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ట్రాక్ రికార్డు అత్యంత దారుణంగా ఉన్నప్పటికీ ఆయనను వెనకేసుకు రావడం ఒక పెద్ద తప్పిదంగా మారింది. మోదీ పాలన పైనే ఇప్పుడు ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన "బొద్దింక" వ్యాఖ్య తర్వాత, కాక్రోచ్ జనతా పార్టీ ఒక వ్యంగ్య అభివ్యక్తిగా మాత్రమే తెరపైకి వచ్చింది. ఈ కించపరిచే వ్యాఖ్యకు ప్రతిస్పందనగా, బోస్టన్‌లో నివసిస్తున్న అభిజీత్ డిప్కే అనే విద్యార్థి ఇన్‌స్టాగ్రామ్‌లో "బొద్దింకలన్నీ ఒక్కటైతే ఎలా ఉంటుంది?" అని పోస్టు చేశాడు. లక్షలాది మంది స్పందించారు. అలా 'కాక్రోచ్ జనతా పార్టీ' జన్మించింది. ఇప్పుడు నిరసనకారుల మొదటి డిమాండ్ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ప్రతిపక్ష పార్టీల అంచనా ప్రకారం, 2014 నుండి ఇలా 152 సార్లు జరిగింది. ఈ పరీక్షలకు ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న లక్షలాది మంది యువత జీవితాలను ఈ లీకేజీలు నాశనం చేశాయి. వీరిలో కొందరి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం, వారు పరీక్షలు రాసేందుకు ఫీజులు చెల్లించడం కోసం తమ భూములను లేదా ఇళ్లను అమ్ముకోవాల్సి వచ్చింది. ఇదొక వినూత్నమైన చట్టబద్ధమైన దోపిడీ. ఈ లీకేజీల వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన కొందరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

జూన్ 6న బోస్టన్ నుండి తిరిగి వచ్చిన దిప్కే, విమానాశ్రయం నుండి నేరుగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు చేరుకున్నాడు. లడఖ్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, విద్యా సంస్కర్త సోనమ్ వాంగ్చుక్ అతనితో కలిసి నిరవధిక నిరాహార దీక్ష ప్రకటించారు. ఇతర నగరాల్లో కూడా నిరసనలు మొదలయ్యాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే జూలై 20న, పార్లమెంటు వైపు మార్చ్ నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. మార్చ్‌కు రెండు రోజుల ముందు, సోనమ్ వాంగ్చుక్‌ను పోలీసులు వేదిక పైనుంచి లాక్కెళ్లి నిర్బంధించారు. ఆ తర్వాత బొద్దింకలు రాజధాని నగరాన్ని కుదిపేశాయి. రైలు, బస్సు, విమానం, మెట్రో మార్గాల్లో వచ్చారు, వారి సంఖ్య గంటగంటకూ పెరుగుతూ పోయింది. ఈ నిరసనకారులు లేదా వారి నాయకులు డిమాండ్ చేస్తున్న దానికంటే ఈ ఉద్యమం చాలా పెద్దదిగా మారిందని స్పష్టమైంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక చిన్న విషయం అయిపోయింది. జూలై 20న ఢిల్లీని ముంచెత్తిన సునామీ తీవ్రతను

పోలీసులు, హోం శాఖ రెండూ పూర్తిగా తప్పుగా అంచనా వేశాయి. వారు అన్ని విధాలా ప్రయత్నించారు. బస్సులు, రోడ్లు, మెట్రో స్టేషన్లను దిగ్బంధించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఇంటర్నెట్‌ను జామ్ చేయడానికి ప్రయత్నించారు. కానీ యువ బొద్దింకలు– ఇంటర్నెట్ జీవులు– ఒకేసారి నవ్వించి, ఏడిపించే మీమ్స్, వీడియోల వరదతో ఆ ప్రయత్నాన్ని ఏమార్చారు. ముస్లింలు, హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, అన్ని కులాలు, వర్గాలకు చెందిన వారు ఏకమై, పోలీసులను ఎదిరిస్తూ ఒకరికొకరు సాయం చేసుకోవడం, ఒకరినొకరు రక్షించుకోవడం మనం చూశాం. వారు మనకు పాఠాలు చెప్పకుండా, గొప్ప ఉపన్యాసాలు ఇవ్వకుండా, మనకు సాధ్యమయ్యే భారతదేశాన్ని, మన కలల అందమైన భారతదేశాన్ని మనకు చూపించారు. పోలీసులు, ఆర్‌ఏఎఫ్ సిబ్బంది తమ లాఠీలను విచక్షణారహితంగా ఝుళిపించారు, పిల్లల తలలు పగలగొట్టారు, కాళ్లు చేతులు విరగ్గొట్టారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. సాయంత్రానికి పోలీసులు నిరసన స్థలంలోని ప్రధాన వేదికను పడగొట్టారు. రాత్రికి నిరసనకారులు దానిని మళ్లీ స్వాధీనం చేసుకున్నారు. దీని నుండి పెద్ద రాజకీయ మార్పు వస్తుం దని ఆశించడం హాస్యాస్పదం. కానీ దీన్ని కేవలం ఒక ఉద్వేగభరిత మైన క్షణంగా కొట్టిపారేయడం మూర్ఖత్వం అవుతుంది. విదేశీ నిధులు, సీఐఏ కుట్రల గురించి గాసిప్‌లు, అపవాదులు, కుట్ర సిద్ధాంతాలతో ప్రధానస్రవంతి మీడియా హోరెత్తించడం ఆశ్చర్యమేమీ కాదు. ఇది అలవాటే. కాని ఇప్పుడు జరుగుతున్నది విస్తృతమైన యువజన వెల్లువ. గతంలో ఉద్యమాలను మోదీ ప్రభుత్వం చాక చక్యంగా అణచగలిగింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలను "ముస్లిం"ల పైకి నెట్టి హిందూ ముస్లిం రాజకీయాలు చేయగలిగారు. రైతు ఉద్యమాన్ని "ఖలిస్థానీలు"గా ప్రచారం చేసి అప్రతిష్ఠపాలు చేశారు. క్యాంపస్‌లలో విద్యార్థి నిరసనలను "అర్బన్ నక్సల్స్" అని ముద్ర వేశారు. ఇప్పుడు ఈ నిరసన కులమత ప్రాంత పరిధులను అధిగమించింది.

"పరాన్నజీవులు" అని తాను చేసిన వ్యాఖ్య గురించి ప్రధాన న్యాయమూర్తి అప్పట్లోనే వివరణ ఇచ్చినప్పటికీ "బొద్దింక" అనే వ్యాఖ్య అత్యున్నత న్యాయస్థానాలు సైతం నిరుద్యోగ యువతను చులకనగా చూస్తున్నాయనే భావనను బలపరిచింది. ఇప్పుడు మరలా ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు కూడా గమనార్హమైనవి.

'బొద్దింకలు' అనే వ్యాఖ్యతో బొద్దింకల ఉద్యమానికి కారణమైన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జులై 20న ఆందోళన కారులపై పోలీసుల క్రూరత్వానికి సంబంధించిన వీడియోలను చూడటానికి తనకు ఆసక్తి లేదని చెబుతూ, కోర్టు సమయాన్ని వృథా చేయవద్దని పిటిషనర్‌ను కోరారు. పిటీషనర్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, "మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా వృథా చేసుకోకండి" అని అన్నారు. పోలీసుల మితిమీరిన బలప్రయోగానికి వీడియో ఆధారాలు ఉన్నాయని న్యాయవాది చెప్పినప్పుడు, ప్రధాన న్యాయమూర్తి "మాకు వీడియోలపై ఆసక్తి లేదు; చూసేందుకు సమయం లేదు." అన్నారు. పరీక్ష పత్రాల లీకేజీ విషయంలో న్యాయపరమైన ఉపశమనం లభించకపోవడం, చట్టపరమైన మార్గాలన్నీ మూసుకుపోయాయనే భావన బలపడుతున్న ప్పుడు ప్రధాన న్యాయమూర్తి చేసిన ఈ వ్యాఖ్యల ప్రభావం విద్యార్థులపై ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

జాతీయ మీడియాగా చెప్పుకునే టీవీ ఛానెళ్లు భారీగా వచ్చిన జన సందోహాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి చూపుతున్నాయి. ఈ నిరసనలను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు నిరసనకారులు జాతీయ మీడియా ప్రతినిధులను గోదీ మీడియా అంటూ హేళన చేస్తున్న వీడియోలు నేడు మీడియా పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో గ్రహించడానికి చాలు. నెల రోజుల పాటు ప్రభుత్వం విద్యార్థులను పూర్తిగా అడ్డుకునేందుకు ప్రయత్నించింది. నిరసనల్లోకి యువత భారీగా పోటెత్తడం ద్వారా ఇప్పుడు ప్రధాన సమస్యగా మార్చారు.

2011 నాటి ఆ అవినీతి వ్యతిరేక ప్రజా ఉద్యమం లాంటి మరో 'అన్నా హజారే మూమెంట్' వైపు మనం వెళుతున్నామా అనే ప్రశ్న కూడా ముందుకు వచ్చింది. ఆ ఉద్యమం ప్రారంభ ఉద్దేశాలు ఏమైనప్పటికీ చివరికి ఆ ఉద్యమ ఫలితాలు చేదుగానే ఉన్నాయన్నది అందరికీ తెలిసిన విషయం. అభిజీత్ దిప్కే మాట్లాడుతూ "నా పేరు ఖాలీద్ అయి ఉంటే, లేదా నేను ముస్లింని అయి ఉంటే, ఈపాటికి నేను జైలులో ఉండేవాడిని" అని చెప్పినప్పుడు ఈ ఉద్యమానికి, అన్నాహజారే ఉద్యమానికి పోలిక లేదని అర్థమైపోయింది. భారత దేశంలో వాస్తవ పరిస్థితులను ఎత్తిచూపే ధైర్యం అతనికి ఉంది. 'హిందువుల వ్యతిరేకత' వస్తుందన్న భయంతో ప్రతిపక్ష నాయకులు సైతం 'ముస్లిం' అనే పదానికి బదులుగా 'మైనారిటీ వర్గం' అని మాత్రమే అంటున్న ప్రస్తుతకాలంలో అతను ఈ మాట బహిరంగంగా చెప్పడం గమనార్హం. 'ఖాలీద్' అనే పేరును దిప్కే చెప్పడంలో సంకేతం ఉంది. షర్జీల్ ఇమామ్ తదితరులతో పాటు దాదాపు ఆరేళ్లుగా ఎలాంటి విచారణ లేకుండా జైలులో మగ్గుతున్న జేఎన్‌యు స్కాలర్ ఉమర్ ఖాలీద్ గురించే అతను మాట్లాడుతున్నాడని చాలా మందికి తెలుసు.

అన్నాహజారే ఉద్యమ కాలంలో, కార్పొరేట్ యాజమాన్యంలోని వందలాది టీవీ ఛానెళ్లలో వారాల పాటు నిరంతరంగా 24x7 కవరేజీని పొందిన అన్నా హజారే ఉద్యమంలాంటిది కాదు, కాక్రోచ్ జనతా పార్టీ ఇంటర్నెట్ సోషల్ మీడియాపై మాత్రమే ఆధారపడు తోంది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న పలు నిరసనల్లో కాక్రోచ్ తిరుగుబాటు కూడా ఒకటి. మధ్యప్రదేశ్‌లో కెన్–బెత్వా నదుల అనుసంధానం ప్రాజెక్టును ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో భారీగా చెట్లను నరికివేయడాన్ని గ్రామస్తులు నిరసిస్తున్నారు. గ్రేటర్ నికోబార్

దీవుల పర్యావరణ వినాశనాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. మణిపూర్ మండుతోంది. ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయి. ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. బిజెపి–ఆర్ఎస్ఎస్ ఆడుతున్న హిందూముస్లిం రాజకీయాల అసలు స్వరూపాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు. 1977లో ఇందిరాగాంధీని గద్దెదించిన జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలోని ఉద్యమంతో కొందరు దీనిని పోలుస్తున్నారు. ఈ పోలికలు అంతగా ఉపయోగ పడవు. కాని కాక్రోచ్ పార్టీ ఆందోళనతో పాటు రైతులు మరోసారి ఢిల్లీకి కవాతు చేయడం ప్రారంభించారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా, పార్లమెంటు మార్చ్‌కే పరిమితమైన ఉద్యమం ఇప్పుడు అధికారానికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటంగా మారుతున్నట్లు కనిపిస్తోందా? ఈ ఉద్యమం సుదీర్ఘంగా సాగితే 2027, 2028, 2029 ఎన్నికల కథ మలుపు తిరుగుతుందా? ఏదైనా నిజమైన రాజకీయ ప్రక్రియ మొదలైతే తప్ప, ఈ ఆకస్మిక ఆగ్రహం ఆవిరైపోతుంది.

కానీ ఈ నిరసనల్లో ఒక వీడియో చాలా ఆలోచించేలా చేస్తుంది.

పోలీసుల బలప్రయోగానికి సంబంధించిన అనేక వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిలో ఆకుపచ్చ టీషర్ట్‌లో పోలీసుల లాఠీదెబ్బలు తింటున్న ఒక యువకుడి వీడియో ఉంది. ఈ ఉద్యమంలో ఎన్నడూ మరువలేని వీడియోగా ఇది మారవచ్చు. లాఠీ భయం పోతే ఎంత తెగువ వస్తుందో ఈ యువకుడు చూపించాడు.

ఆ యువకుడిపై రాపిడ్ యాక్షన్ ఫోర్స్ జవాన్లు మూకుమ్మడిగా, విచక్షణారహితంగా లాఠీలతో కొడుతున్నా, అతడు తన స్థానం నుంచి కదలలేదు. అలాగే నిలబడ్డాడు. “కొట్టండి సార్… కొట్టండి సార్, కొట్టండి, ఇంకా కొట్టండి సార్” అంటూ అరుస్తున్నాడు. అతని నోటి నుంచి వచ్చిన ఆ మాటల్లో గాంధీ మార్గం ధ్వనించింది. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పట్టుదల ఇమిడి ఉంది. తియానన్మెన్ స్క్వేర్‌లో ట్యాంక్ ముందు నిలబడిన ఆ అజ్ఞాత వ్యక్తి అంతరాత్మ కనిపించింది.

ఆ తర్వాత జరిగింది ఎవరూ ఊహించనిది. పోలీసుల లాఠీలు ఆగిపోయాయి. దెబ్బలు తింటున్న సమయంలో ఆ వ్యక్తి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయలేదు, పెనుగులాడలేదు. కనీసం తనను తాను రక్షించుకునే ప్రయత్నం కూడా చేయలేదు. కేవలం “నన్ను కొట్టండి సార్” అని మాత్రమే అన్నాడు. లాఠీలు చిన్నబోయాయి, అలిసిపోయాయి. జవాన్లు అకస్మాత్తుగా చేతులెత్తేసినట్లు అనిపించింది. అతడు అహింసావాది. అతని మాటల్లో హింస లేదు, అతని శరీరంలోనూ హింస లేదు. ఒక సామాన్యుడిపై అకస్మాత్తుగా లాఠీ దెబ్బ పడితే అతను పారిపోతాడు. బహుశా అరుస్తూ ఏదైనా అనవచ్చు, తిట్టవచ్చు. హింసాత్మకంగా కూడా మారవచ్చు. కానీ యువకుడు … “కొట్టండి సార్, కొట్టండి,” అని అరిచాడు. హింసను అహింసతో అడ్డుకునే గాంధేయ మార్గం ఇది. దీని ముందు లాఠీలే కాదు, మందుగుండు సామాగ్రి, ఫిరంగులు, మహా సామ్రాజ్యాలు సైతం ఓడిపోతాయి. హింస లేకుండా పోలీసుల లాఠీలను సైతం మూగబోయేలా చేసే భారతదేశం ఎలా ఉంటుందో ఆ యువకుడు చూపించాడు. ఆ తర్వాత వీడియోలో త్రివర్ణ పతాకం పట్టుకున్న ఒక ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ మహిళా జవాను వచ్చి, ఆ యువకుడిని కొద్దిగా వెనక్కి నెట్టడం కనిపిస్తుంది. బహుశా ఆమె అతన్ని లాఠీల నుంచి రక్షించడానికి వచ్చి ఉండవచ్చు. కొద్దిగా వెనక్కి జరిగినప్పుడు, ఆ యువకుడి కుడి కాలిపై మరో జవాను ఒక లాఠీ దెబ్బ వేశాడు. వెంటనే హెల్మెట్ ధరించిన ఇంకో జవాను, లాఠీతో కొట్టిన జవానును వెనక్కి నెట్టి, వద్దని వారించాడు. ఆ యువకుడిని నెట్టుకుంటూ వెనక్కి తీసుకెళ్ళారు. ఆ మహిళా జవాను తన రెండు చేతులు చాపి ఒక గోడలా, అతనికి రక్షణ కవచంగా నిలబడడం కనిపించింది. ఈ ఉద్యమాన్ని ఈ వీడియో నిర్వచిస్తుందా?

ఈ వీడియోలో పలు కోణాలు ఒకేసారి కనిపిస్తాయి. మొదటిది, ఎలాంటి హింస లేదా ఆయుధం లేకుండా తన హక్కును అడుగుతున్న యువకుడు. రెండవది, ప్రభుత్వ ఆదేశాలు రాగానే యంత్రాల్లా లాఠీలు ఝుళిపించే జవాన్లు. మూడవది, ఆ క్షణంలో ఆదేశాలు అమలు చేయవలసిన డ్యూటీ, మానవవిలువల మధ్య నిలబడిన ఆ మహిళా జవాను. నిరసనకారులను తరిమికొట్టడం ఆమె విధి. కానీ దారుణంగా దెబ్బలు తింటున్నప్పటికీ రొమ్ము విరుచుకుని నిలబడిన యువకుడిని రక్షించడం మానవవిలువల కర్తవ్యం. బహుశా ఆ నిరసనకారుడిలో ఆమెకు తనవాళ్లు ఎవరైనా కనిపించి ఉండవచ్చు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న తన తమ్ముడే ఆమెకు కనిపించాడేమో! సోషల్ మీడియా కంట్లో పడుతున్న ఈ క్రూరమైన దృశ్యాల ప్రభావాన్ని కొంత తగ్గించడానికి ఆమె అలా చేసి ఉండవచ్చు.

ఈ ఉద్యమం వల్ల వచ్చే రాజకీయ మార్పుల గురించి కాదు ఇప్పుడు మనం ఆలోచించవలసింది. భారతదేశంలో విద్యారంగం, ఉపాధి రంగం ఈ రెండింటి మధ్య ఏమైనా పొంతన ఉందా? అనేది ఆలోచించవలసిన ప్రశ్న. మెడిసిన్, ఇంజనీరింగ్ తప్ప మరో చదువు గురించి పిల్లలు ఆలోచించలేని పరిస్థితి ఉంది. చదువుకున్న పిల్లలకు ఉపాధి ఎక్కడ? మాన్యుఫాక్చరింగ్ రంగం కుదేలైన తర్వాత అక్కడ ఉద్యోగాలు లేవు. ప్రయివేటైజేషన్ తర్వాత ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు లేవు. స్వంత వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ప్రోత్సాహకరమైన పరిస్థితి లేదు. ప్రభుత్వ ఉద్యోగాలు తప్ప మరో అవకాశం ఎక్కడైనా ఉందా? ప్రభుత్వ ఉద్యోగాలకు రాసే పరీక్ష పత్రాలు లీకైతే విద్యార్థులు ఏం చేయాలి? నీట్ వంటి పరిక్షల్లో మెడిసిన్ చదవడానికి ప్రిపరేషన్ కోసం లక్షలు ఖర్చు చేసే విద్యార్థులు ప్రశ్నాపత్రం లీకయిన వార్త తర్వాత ఎంత హతాశులవుతారు? ఈ ప్రశ్నలపై ఆలోచించవలసిన అవసరం ఉంది. ఈ నిరసనల తర్వాతైనా దేశంలో విద్యావ్యవస్థపై పునరాలోచన ప్రారంభం కావాలి. ✤

హిబా అర్జుమంద్ ఖాన్

‘టిక్.. టిక్.. టిక్..’ – గోడ గడియారం నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నడుస్తోంది. కానీ, ఆ ఇంట్లో కాలం ఎప్పుడో స్తంభించిపోయింది.

ఐదంకెల జీతం ఉంది... కోరుకుంది కొనగల ఆర్థిక స్థోమత ఉంది... కానీ, ఆ నాలుగు గోడల మధ్య ‘జీవితం’ మాత్రం లేదు. అక్కడ సమీర్ ఆఫీస్ ఫైళ్లతో కుస్తీ పడుతుంటే, ఇక్కడ అతని భార్య రోషన్ మాత్రం లంకంత ఇంట్లో ఒంటరితనంతో నిశ్శబ్ద యుద్ధం చేస్తూ ఉండేది. ఒకప్పుడు సాయంత్రం కాగానే నవ్వులు పువ్వులతో నిండిపోయే ఆ ఇల్లు, ఇప్పుడు కేవలం రాత్రి పూట వచ్చి బస చేసే ఒక అతిథి గృహంలా మారిపోయింది.

సమీర్ ప్రభుత్వ కార్యాలయంలో బాధ్యతాయుతమైన ఉద్యోగి. నిజాయితీ అతని బలం. పని పట్ల అంకితభావం అతని గుర్తింపు. సహోద్యోగుల దృష్టిలో అతడు ఆదర్శ ఉద్యోగి. పై అధికారుల దృష్టిలో నమ్మకమైన అధికారి.

కానీ...

కార్యాలయంలో బాధ్యతలు పెరిగిన కొద్దీ, ఇంటికి చేరడం రోజు రోజుకూ ఆలస్య మవుతూవచ్చింది.

అయితే ఉద్యోగ జీవితపు తొలి రోజులు మాత్రం ఇందుకు పూర్తి భిన్నం.

సమయానికి ఇంటికి చేరుకోవడం అతనికి అలవాటు. సాయంత్రం కాగానే ఇంటి దారి పట్టేవాడు. భార్య రోషన్‌తో మనస్ఫూర్తిగా కబుర్లు చెప్పడం, పిల్లలతో కాసేపు ఆటలాడటం, కుటుంబమంతా కలిసి ఒకే డైనింగ్ టేబుల్ దగ్గర కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయడం – అవే అతని రోజువారీ జీవితంలో అత్యంత అందమైన క్షణాలు. ఆ చిన్న చిన్న సంతోషాలే అతనికి మరుసటి రోజు పని చేయడానికి ఇంధనాన్ని సమకూర్చేవి.

కాలం గడిచిన కొద్దీ బాధ్యతలు పెరిగాయి. కార్యాలయంలో హోదా పెరిగింది, దాంతోపాటే సీటుపై కూర్చునే సమయమూ పెరిగింది. ఉదయం ఏడు గంటలకే ఇల్లు వదిలే సమీర్, రాత్రి బాగా ఆలస్యంగా ఇల్లు చేరడం నిత్యకృత్యమైపోయింది. చివరకు వారంతపు సెలవులు, పండగలు సైతం కార్యాలయంలో దుమ్ము పట్టిన ఫైళ్ల మధ్యే కరిగిపోవడం మొదలైంది.

మొదట్లో రోషన్ దీనిని పెద్దగా పట్టించుకోలేదు. ‘బాధ్యతలు పెరిగాయి కదా... ప్రమోషన్ వచ్చింది, కొన్నాళ్లలో అన్నీ సర్దు కుంటాయిలే,’ అని తనను తాను ఓదార్చుకుంది. కానీ రోజులు నెలలయ్యాయి.. నెలలు సంవత్సరాలు.. పరిస్థితి మాత్రం

మారలేదు. ఇల్లు ఐశ్వర్యంతో తులతూగుతోంది, అవసరాలకు డబ్బుంది, ఆధునిక సౌకర్యాలకు కొదవలేదు. కానీ, ఒకటి మాత్రం నెమ్మదిగా ఆ ఇంటి గుమ్మం దాటి వెళ్ళిపోతోంది. కుటుంబమంతా కలిసి కాసేపు ప్రశాంతంగా గడిపే ‘ సమయం ‘ అనే అమూల్యమైన సంపద ఆ ఇంట్లో కరువైంది.

ఆ రాత్రి కూడా సమీర్ ఇంటికి చేరేసరికి అర్ధరాత్రి దాటింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్లలు ఎప్పుడో నిద్రపోయారు. కానీ రోషన్ ఇంకా మెలుకువగానే ఉంది. అతడు అలిసిపోయి లోపలికి అడుగుపెట్టగానే ఆమె లేచి అలవాటుగా మంచినీళ్ల గ్లాసు అందించింది.

'ఇంకా నిద్రపోలేదా రోషన్?' అన్నాడు సమీర్ బద్ధకంగా, కోటు విప్పుతూ.

రోషన్ పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది... కానీ ఆ కళ్లల్లో ఒక నిశితమైన శూన్యం దాగుంది. 'నిద్రవస్తోంది సమీర్... కానీ నీ కోసం 'ఎదురుచూపు' అనే డ్యూటీ ఇంకా పూర్తి కాలేదు కదా! అది పూర్తయితేనేగా నా రోజు ముగిసేది,' అంది. ఆ మాటల్లో కోపం లేదు, అంతకంటే ప్రమాదకరమైన నిరాశ ఉంది.

సమీర్ ముఖం కడుక్కొని భోజనానికి కూర్చున్నాడు. ఆ డైనింగ్ టేబుల్ దగ్గర ఇద్దరి మధ్య మౌనం ఒక పెద్ద యుద్ధం చేస్తోంది. ప్లేటులో అన్నం కలుపుకుంటూ రోషన్ మెల్లగా అడిగింది.

'సమీర్ ... ఒక విషయం అడగనా?'

'అడుగు రోషన్...' అన్నాడు సమీర్ ఆమె వైపు చూడకుండానే.

'ఉద్యోగం మన జీవితంలో ఒక భాగమా... లేక అదే మన జీవితమా?'

నోటి దగ్గరికి వెళ్లిన ముద్ద అలాగే ఆగిపోయింది సమీర్‌కి. గదిలో ఏసీ తిరుగుతున్నా అతనికి ఒక్కసారిగా చెమటలు పట్టినట్టయింది.

రోషన్ ఆపలేదు. అతని కళ్లలోకి నేరుగా చూస్తూ అంది – 'నువ్వు ఉదయం వెళ్తావు, రాత్రి వస్తావు. ఈ నాలుగు గోడల మధ్య నేను ఒంటరిగా గడియారం ముళ్ల వైపు చూస్తూ ఉంటాను. పిల్లలు ఎదుగుతున్నారు... కానీ వాళ్ల ఎదుగుదలలో, వాళ్ల బాల్యంలో తండ్రిగా నువ్వు లేవు. మన అవసరాలకు డబ్బుంది, కానీ ఆ డబ్బుతో కొనుక్కోవడానికి ఇంట్లో సంతోషమే మిగలడం లేదు. నాదో చిన్న సందేహం... మనిషి బతకడం కోసం సంపాదిస్తాడా? లేక సంపాదిస్తూనే బతుకును కోల్పోతాడా?'

ఆమె స్వరం చాలా ప్రశాంతంగానే ఉంది, కానీ ప్రతి మాట ఒక పదునైన బాణంలా అతని హృదయాన్ని తాకుతోంది.

సమీర్ సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు. 'ఈ మధ్య ఆఫీసులో వర్క్ లోడ్ చాలా ఎక్కువగా ఉంది రోషన్... దానికితోడు ఇయర్ ఎండ్ ఆడిట్ కూడా నడుస్తోంది, నీకు తెలుసు కదా...'

అతని మాట పూర్తికాకముందే రోషన్ చిన్నగా నవ్వింది. 'నేను నీ ఉద్యోగాన్ని తప్పుపట్టడం లేదు సమీర్, మీ కష్టాన్ని గౌరవిస్తాను. కానీ నేను అడిగిన ప్రశ్నకు పుస్తకాల్లో సమాధానం దొరకదు. ఒక్కసారి ఆలోచించు.' అని చెప్పి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సమీర్ కళ్లకు నిద్ర పట్టలేదు. బెడ్‌రూమ్ విండో గుండా బయట కనిపిస్తున్న నల్లటి ఆకాశాన్ని చూస్తూ ఉండిపోయాడు. రోషన్ అడిగిన ఆ ఒక్క ప్రశ్న అతని మనసులో అలలు రేపుతూనే ఉంది.

'సంపాదన కోసం మనిషి జీవిస్తున్నాడా... లేక జీవితం కోల్పోయి సంపాదిస్తున్నాడా?' అనే ఆలోచన అతని మైండ్‌ను వదల్లేదు.

మరుసటి రోజు ఎప్పటిలాగే ఉదయాన్నే కార్యాలయానికి బయలు దేరాడు. కానీ ఆ రోజు అతని మనసు పనిలో లీనమవ్వలేదు. కంప్యూటర్ స్క్రీన్ మీద నంబర్లు కాదు, భార్య అడిగిన ప్రశ్నలు కనిపిస్తున్నాయి. ఎదురుగా తెరిచి ఉన్న ఫైళ్లపై చూపు ఉన్నా, ఆలోచనలు మాత్రం ఇల్లు, పిల్లల చుట్టూనే తిరుగుతున్నాయి.

మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సహోద్యోగులు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. సమీర్ మాత్రం నిశ్శబ్దంగా తన కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు.

అతని ముఖంలో ఏదో తెలియని దిగులు కనిపించడంతో పక్క సీట్ సహోద్యోగి ప్రసాద్ వచ్చి, 'ఏమైంది సమీర్? ఆరోగ్యం బాగో లేదా? చాలా అన్యమనస్కంగా ఉన్నావు,' అని అడిగాడు.

అతను చిన్నగా నవ్వి, 'ఆరోగ్యం బాగానే ఉంది ప్రసాద్... కానీ ఇన్నాళ్లూ సాల్వ్ చేయని ఒక పెద్ద పెండింగ్ కేసుకు సమాధానం వెతుకుతున్నాను,' అన్నాడు.

సాయంత్రం 5 గంటలు కాబోతోంది. పని ముగిసే సమయానికి బాస్ నుండి మరో అర్జెంట్ ఫైలు అతని బల్లపైకి వచ్చింది. మామూలుగా అయితే ఎంత రాత్రయినా ఆ పని పూర్తి చేసి గానీ సీటు వదలని సమీర్, ఆ రోజు కాసేపు ఆ ఫైలును చూస్తూ ఉండి పోయాడు.

పెద్దగా ఆలోచించకుండానే, సీట్లోంచి లేచి నేరుగా పై అధికారి గదిలోకి వెళ్లాడు. ఇన్నేళ్ల సర్వీసులో ఎప్పుడూ 'ఎస్ సార్. ' అనే సమీర్, ఈసారి బాస్ కళ్లల్లోకి చూసి ధైర్యంగా, వినయంగా అన్నాడు– 'సార్, ఇది రేపు ఉదయం అందరికంటే ముందే వచ్చి పూర్తి చేస్తాను. ఈరోజు నేను కాస్త త్వరగా వెళ్లాలి. ఇంట్లో ఒక ముఖ్యమైన పెండింగ్ వర్క్ ఉంది.'

బాస్ ఆశ్చర్యంగా అతని వైపు చూశాడు. సమీర్ నోట అలాంటి మాట వినడం అదే మొదటిసారి. 'సరే... రేపు ఉదయానికల్లా

పూర్తి చేయండి,' అని బాస్ పర్మిషన్ ఇచ్చాడు. సమీర్ ధన్యవాదాలు చెప్పి బ్యాగ్ సర్దుకుని బయలుదేరాడు.

ఇంటికి చేరేసరికి సాయంత్రపు వెలుతురు ఇంకా పూర్తిగా చెదరిపోలేదు. పక్షులు గూటికి చేరుకుంటున్న సమయం.

బెల్ నొక్కగానే రోషన్ తలుపు తీసింది. ఈ సమయానికి, సూర్యుడు అస్తమిస్తున్న వేళ తన భర్త ఇంట్లోకి అడుగుపెట్టడం చూసి ఆమె ఒక్క క్షణం నమ్మలేకపోయింది. కళ్లల్లో ఆందోళనతో, 'ఏమైంది సమీర్? ఆఫీసులో ఏదైనా సమస్యా? ఒంట్లో బాగో లేదా?' అని అడిగింది.

సమీర్ నవ్వి, ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని లోపలికి నడుస్తూ అన్నాడు – 'ఒంట్లో కాదు రోషన్... ఇన్నాళ్లూ నా ఆలోచనల్లో బాగోలేదు. చాలా రోజుల తర్వాత ఈ ఇంటికి కూడా నన్ను చూసే హక్కు ఉందని గుర్తొచ్చింది. బ్యాంకుల్లో దాచుకోవడానికి కరెన్సీ నోట్లు దొరుకుతాయి కానీ, కరిగిపోయే మన పిల్లల బాల్యాన్ని, నీ కళ్లలోని నిరీక్షణను దాచుకునే ఏ బ్యాంకూ ఈ భూమి మీద లేదు. ఆఫీసుకి నేను లేకపోయినా మరో ఉద్యోగి దొరుకుతాడు... కానీ నా కుటుంబానికి నేనే సర్వస్వం.'

ఆ మాట విన్న రోషన్ కళ్లలో ఇన్నాళ్లూ లేని ఒక తెలియని వెలుగు మెరిసింది. ఎన్నాళ్లుగానో ఆమె నిరీక్షిస్తున్న అపురూపమైన క్షణం అది.

ఇద్దరూ కలిసి టీ తాగుతూ చాలా రోజుల తర్వాత మనస్ఫూర్తిగా మాట్లాడుకున్నారు. పిల్లలు స్కూల్ నుండి రాగానే తండ్రిని ఇంట్లో చూసి నమ్మలేకపోయారు. వాళ్లు ఎగిరి గంతేసి వచ్చి సమీర్ చుట్టూ చేరి, స్కూల్లో జరిగిన చిన్న చిన్న సంగతులు, ఆటల గురించి ఎంతో ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టారు. సమీర్ వాటన్నింటినీ ఎంతో ఆసక్తిగా వింటూ, వాళ్లను గుండెలకు హత్తుకున్నాడు. ఆ కొద్ది క్షణాల్లోనే అతనికి ఒక గొప్ప నిజం అర్థమైంది... తను ఆఫీసులో సంపాదించే సక్సెస్ కంటే, ఈ పిల్లల నవ్వుల్లోనే అసలైన గెలుపు దాగుందని!

రాత్రి భోజనం అందరూ కలిసి ముగించాక, పిల్లలు పడుకున్న తర్వాత సమీర్, రోషన్ ఇద్దరూ డాబాపైకి వెళ్లారు. చల్లటి గాలి వీస్తోంది. ఆకాశమంతా నక్షత్రాలు విరబూశాయి. కొద్దిసేపు ఇద్దరి మధ్యా ఒక అందమైన మౌనం రాజ్యమేలింది.

ఆ మౌనాన్ని ఛేదిస్తూ సమీర్ మెల్లగా అన్నాడు – 'రోషన్... నిన్న నువ్వు అడిగిన ప్రశ్న నన్ను రోజంతా వెంటాడింది. మనిషి ఎందుకు సంపాదిస్తాడు? తన కుటుంబం సుఖంగా ఉండాలని, తనవాళ్లు సంతోషంగా ఉండాలని. కానీ అదే కుటుంబానికి సమయం ఇవ్వకుండా, వాళ్ల సంతోషాన్ని కళ్లారా చూడకుండా సంపాదిస్తే... ఆ సంపాదనలో అర్థం ఏముంటుంది? డబ్బు కావాలి, కానీ అది జీవితాన్ని మింగేసేంతగా కాదు.'

రోషన్ పెదవులపై సన్నని తృప్తికరమైన చిరునవ్వు మెరిసింది. 'నేను సంపాదన వద్దనడం లేదు సమీర్, అది మన అవసరం. కానీ డబ్బు కోసం మనిషి తన జీవితంలోని అందమైన క్షణాలనే కోల్పోవడం బాధగా ఉంటుంది. పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్న ఈ రోజులు మళ్లీ రావు. వాళ్ల బాల్యాన్ని మనం ఏ

బ్యాంకులోనూ ఫిక్సడ్ డిపాజిట్ చేయలేం కదా!' అంది ప్రశాంతంగా.

అతను దృఢంగా రోషన్ చేతులు పట్టుకుని అన్నాడు – 'ఇకపైనా పని చేస్తాను. బాధ్యతల నుంచి పారిపోను. కానీ నా కుటుంబం హక్కును కూడా దూరం చేయను. రోజులో ఎంత పని ఉన్నా, కొంత సమయం కేవలం నా వాళ్ల కోసమే ఉంటుంది.'

రోషన్ కళ్లల్లో ఒక పరిపూర్ణమైన తృప్తి కనిపించింది. ఆమెకు కావలసింది పెద్ద పెద్ద బంగారు నగలు, బంగ్లాలు కాదు... తన భర్త తన మనసును అర్థం చేసుకుని, తమతో పాటు నడవడమే.

ఆ రాత్రి సమీర్ ఇన్నేళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నడూ లేనంత నిశ్చింతగా, ప్రశాంతంగా నిద్రపోయాడు.

కొన్ని రోజుల తర్వాత అతని సహోద్యోగులు కూడా అతనిలో వచ్చిన మార్పును గమనించారు. కార్యాలయంలో పని అదే శ్రద్ధతో, అంతే వేగంగా చేస్తున్నాడు. కానీ పని ముగిసిన తర్వాత అవసరం లేకుండా ఆఫీసులోనే గడపడం మానేశాడు.

కుటుంబంతో గడిపే సమయాన్ని తన దినచర్యలో ఒక ముఖ్యమైన భాగంగా మార్చుకున్నాడు.

జీవితంలో డబ్బు అవసరమే, ఉద్యోగం కూడా అవసరమే. కానీ వాటికంటే అత్యంత విలువైనది మనతో పాటు నడిచే మనుషులు, మన కోసం ఎదురుచూసే కళ్లూ, మన రాకతో వెలిగిపోయే ఒక ఇల్లు అని అతను గ్రహించాడు.

?జీవితంలో గెలవడం అంటే కేవలం బ్యాంకు బ్యాలెన్స్ పెంచడం కాదు... మనం అలసిపోయి ఇంటికి వెళ్లినప్పుడు మన కోసం వెలిగే కళ్లల్లో ఆనందాన్ని చూడటం.

పుస్తకాల్లో దొరకని ఇలాంటి ప్రశ్నలకే జీవితం అనుభవాల ద్వారా సరైన సమాధానాన్ని చూపిస్తుంది. మనల్ని ప్రేమించే మనుషుల హృదయాల్లోనే ఆ జవాబులు లభిస్తాయి.

సమీర్ ఇప్పుడు గడియారం ముళ్లతో పాటు పరిగెత్తడం లేదు... కాలానికి ఎదురునిలిచి తనే జీవితాన్ని శాసిస్తున్నాడు. ఎందుకంటే, ఆయుష్షు కరిగిపోకముందే ఆత్మీయుల మధ్య బతకడమే అసలైన గెలుపని, ఆ వెచ్చని బంధాల వెలుగులోనే మనిషి ప్రయాణం పరిపూర్ణమవుతుందని అతనికి అర్థమైంది. ✤

1857 జూలై 17న ఆంగ్లేయుల తరిమివేత లక్ష్యంగా

“బ్రిటిష్ రెసిడెన్సీ” పై దాడి జరిపిన ప్రజా యుద్ధయోధులు

మౌల్వీ అల్లావుద్దీన్ - పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

సయ్యద్ నశీర్ అహమ్మద్

1800 అక్టోబర్ 12న నిజాం సంస్థానం ఈస్ట్ ఇండియా కంపెనీతో “సైనిక సహకార ఒప్పందం” చేసుకుంది. ఈ ఒప్పందం వల్ల నిజాం రాజ్యం కాస్తా “బ్రిటిష్ రక్షిత ప్రాంతం” అయ్యింది. ఆ తరువాత కూడా ఇరు పక్షాల మధ్య కుదిరిన పలు ఒప్పందాల ఫలితంగా ఆంగ్లేయులు నిజాం సంస్థానంలో ఆధిపత్యం, అహంకారం, అంతులేని పెత్తనం ప్రదర్శించ సాగారు. అందుకు ఆగ్రహించిన నైజాం ప్రజలు, ప్రముఖులు ఆంగ్లేయుల చర్యల పట్ల వ్యతిరేకత ప్రదర్శించసాగారు. ఈ వ్యతిరేకత 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం సమయానికి శిఖరాగ్రం చేరుకుంది. ఆ పరిణామాల ఫలితంగా 1857 జూలై 17న హైదరాబాదు నగరంలోని ప్రఖ్యాత మక్కా మసీదులో ప్రజలు సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో వ్యక్తమయిన నిర్ణయం మేరకు ఆంగ్లేయుల ఆధిపత్యానికి కేంద్ర స్థానం అయినటువంటి “ బ్రిటిష్ రెసిడెన్సీ” మీద దాడికి ప్రజలు సిద్ధమయ్యారు. మక్కా మసీదు నుండి అందిన ఆయుధాన్ని తీసుకుని ప్రజా సమూహం బ్రిటిష్ రెసిడెన్సీ దిశగా సాగింది. ఈ విషయం తెలుసుకున్న నిజాం నవాబు కదలి వస్తున్న ప్రజాదండుకు సంబంధించిన సమాచారాన్ని బ్రిటిష్ రెసిడెన్సీ లోని ఆంగ్లేయ అధికారులకు చేరవేశాడు. ఆ మరుక్షణమే అంగ్లేయాధికారులు అప్రమత్తులయ్యారు. ఆధునిక ఆయుధాలు

కలిగిన తమ సైనిక పటాలాలను సమయోధులను ఎదుర్కోడానికి సిద్ధం చేసారు. అశ్విక దళాన్ని, ఫిరంగి దళాన్ని మోహరించారు.

ఆ చారిత్రాత్మక, సాహసోపేత దాడికి మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌లు నాయకత్వం వహించారు. 1857 జూలై 17 సాయంత్రం ఆరంభం అయినటువంటి పోరాటం ఆ రాత్రంతా సాగి మరుసటి రోజు తెల్లవారు ఝామున ముగిసింది. ఈ పోరులో 32 మంది అమరులయ్యారు. పలువురు గాయపడ్డారు. ఆంగ్లేయుల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్న అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్ ప్రజలను సమీకరించుకుని ఆంగ్లేయుల మీద తమ పోరాటాన్ని కొనసాగించేందుకు ప్రస్తుత పోరాట స్థలి నుండి తప్పుకున్నారు. ఆ తరువాత ఆ ఇరువురు యోధులను నిర్బంధించేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు అంగ్ల-నిజాం సైన్యాలతో సాగిన పోరాటంలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ అమరులయ్యారు. మౌల్వీ అల్లావుద్దీన్ కొంత కాలం తరువాత పట్టుబడ్డారు. ఆయన ఆజన్మాంతర శిక్షకు గురయ్యారు. ఆయన అండమాను శిక్షా క్షేత్రం పంపబడ్డారు. ఆ అండమాను శిక్షా కేంద్రంలో దశాబ్దాలపాటు గడిపిన మౌల్వీ అల్లావుద్దీన్ కన్నుమూశారు. ఆ యోధుల స్మారకంగా 1957లో భారత ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని కోటి సెంటర్‌లో ఒక స్మారక స్థూపం కూడా నిర్మించింది.

ఆనాడు జూలై 17న బ్రిటిష్ రెసిడెన్సీ మీద జరిగిన దాడిని గుర్తు చేసుకుంటూ, ఆ దాడికి నాయకత్వం చేపట్టిన ఆ ఇరువురు స్వాతంత్ర్య సమరయోధుల స్మరణలో తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలో కూడా జూలై 17న పలు స్మారక కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంగా, ఆ యోధుల త్యాగమయ సాహసోపేత పోరాట చరిత్ర క్లుప్తంగా.

మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్

దక్షిణ భారత దేశంలో బలమైన నైజాం సంస్థానంలో ఆంగ్లేయుల పెత్తనానికి వ్యతిరేకంగా ప్రజలను తిరుగుబాటుకు ప్రత్యక్షంగా ప్రోత్సహించిన ధార్మిక నాయకులు మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్. ఆయన తిరుగుబాటును ప్రోత్సహించటమే కాకుండా స్వయంగా ప్రత్యక్ష పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజధాని, పూర్వపు నైజాం సంస్థాన రాజధాని కేంద్రం హైదరాబాద్ నివాసి. 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభం కాగానే అల్లావుద్దీన్ తిరుగుబాటు కార్యకలాపాలను ముమ్మరం చేశారు. నిజాం నవాబు సంస్థానంలో భాగమైన ఔరంగాబాదులో ఆంగ్లేయుల మీద తిరుగుబాటు రగులుకుంది. ఆ తిరుగుబాటుకు శ్రీకారం పలికి అక్కడ నుండి ఆశ్రయం నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన యోధులను నిజాం ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ యోధులను విడుదల చేయాలన్న ప్రజల, నిజాం నవాబు విజ్ఞప్తులు పంపారు. ఆ విన్నతులను ఆంగ్లేయులకు సన్నిహితంగా వ్యవహరిస్తున్న నవాబు తిరస్కరించడంతో ఖిన్నులైన ప్రజలు, ప్రముఖులు 1857 జూలై 17న చారిత్రక మక్కా మసీదులో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో బ్రిటిష్ రాజ్య ప్రతినిధి నివాసం (బ్రిటిష్ రెసిడెన్సీ) మీద దాడి చేయాలని నిర్ణయించారు. నిర్ణయం మేరకు జూలై 17 మధ్యాహ్నం నాలుగు గంటల సమయానికి మౌల్వీ అల్లావుద్దీన్, మరో పోరాట యోధులు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ల నాయ కత్వంలో సుమారు ఐదు వందల మంది యోధులు రణ నినాదం చేస్తూ గుమికూడారు. ఆ సమూహం ప్రస్తుత సుల్తాన్ బజారు నుండి బ్రిటిష్ ఆధిపత్యానికి చిహ్నమైన 'బ్రిటిష్ రెసిడెన్సీ' మీద దాడికి ఉపక్రమించింది. ఆంగ్లేయులకు స్నేహహస్తం అందించిన నైజాం నవాబు ఈ దాడి విషయాన్ని ఆఘమేఘాల మీద ఆంగ్లేయాధికారులకు తెలిపారు. ఆంగ్లేయాధికారులు, నిజాం-ఆంగ్ల సైన్యాలు వ్యూహాత్మకంగా వ్యవహరించి, అదనపు బలగాలతో 'బ్రిటిష్ రెసిడెన్సీ' మోహరించాయి. అల్లావుద్దీన్, తుర్రేబాజ్ ఖాన్‌ల నేతృత్వంలోని ప్రజల దాడిని ఎదుర్కొన్నారు. ఆ రాత్రంతా ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయి. చివరకు శత్రు బలగాలది పైచేయి కావడంతో స్వదేశీ యోధులు, దాడిని విరమించుకుని నిష్క్రమించారు. ఈ సాహసోపేత చర్యతో ఖంగుతిన్న ఆధికారులు, నిజాం-ఆంగ్ల సైన్యాలు ఆగ్రహించి హైదరాబాద్ నగర ప్రజల మీద విరుచుకుపడ్డాయి. మౌల్వీ అల్లావుద్దీన్‌ను పట్టిచ్చిన వారికి నాలుగు వేల రూపాయల నజరానా ప్రకటించగా మౌల్వీ అల్లావుద్దీన్ అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఒకటిన్నర సంవత్సరం పాటు పీర్ ముహమ్మద్ అను సన్నిహితుని వద్ద ఆశ్రయం పొందిన మౌల్వీ స్వంతగడ్డ, స్వజనుల మీద ఆంగ్లేయుల పెత్తనానికి చరమగీతం పాడేందుకు సయ్యద్ భిక్కూ, సయ్యద్ లాల్, ముహమ్మద్ అలీ లాంటి పోరాట యోధులతో సంప్రదింపులు సాగించారు. చివరకు ఆయనను ఆంగ్ల బలగాలు నిర్బంధించి, ద్వీపాంతరవాస శిక్ష విధించాయి. ఆయనను 1859 జూన్ 28న అండమాన్ దీవులలోని జైలుకు పంపారు. ఆ జైలులో పాతికేళ్ల దుర్భర నిర్బంధ జీవితం గడిపిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ 1884లో కన్నుమూసారని డాక్టర్ సరోజినీ రేగాని పేర్కొన్నప్పటికి ఆ మహాయోధ 1889 వరకు సజీవులన్న విషయాన్ని పలు అధికారిక దస్త్రాలు వెల్లడిస్తున్నాయి.

పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

ఆధునిక ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటిష్ పాలకులను ఎదుర్కోవటం మృత్యువును వాటేసుకోవడ

మని స్వదేశీ యోధులకు స్పష్టంగా తెలిసినా, తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి పరాయి పాలకులను తరిమి కొట్టేం దుకు అలనాడు నడుం కట్టిన పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నివాసి. ఆయన తండ్రి పఠాన్ రుస్తుం ఖాన్. బ్రిటీష్ సైన్యంలో సైన్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలం నాయకుడు. ఆంగ్లేయులకు హితుడుగా మారిన నిజాం నవాబు అభీష్టానికి వ్యతిరేకంగా బ్రిటీష్ పాలకుల నుండి మాతృదేశాన్ని విముక్తి చేయమన్న మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ ఉద్బోధ మేరకు తుర్రెబాజ్ ఖాన్ పోరుబాట ఎంచుకున్నారు. మౌల్వీ అల్లావుద్దీన్ సహకారంతో చారిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటీష్ ఆధిపత్యా నికి చిహ్నమైన హైదరాబాద్ రెసిడెన్సీ మీద సుమారు ఐదు వందల మంది సాహసికులతో 1857 జూలై 17న తుర్రెబాజ్ ఖాన్ సాహసోపేతమైన దాడి చేశారు. ఆ పోరాటంలో పలువురు సహచరులను కోల్పోయి గాయపడిన ఆయన బ్రిటీష్–నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టుబడగా ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, ఆయన యావదాస్తిని స్వాధీనం చేసుకుంది. ఆంగ్లేయాధికారుల సలహా మేరకు విధించిన ఆ శిక్ష అమలు జరిగేలోగా పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ 1859 జనవరి 18న జైలు నుండి తప్పించుకున్నారు. ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రెబాజ్ ఖాన్‌ను సజీవంగా గానీ, నిర్జీవంగా గానీ పట్టి తెచ్చిన వారికి అయిదు వేల రూపాయల నగదు నజరానాను 1859 జనవరి 19న ప్రకటించింది. పాలకులు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్బాన్ అలీ అను నమ్మకద్రోహి అందించిన సమాచారంతో మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామం మీద 1859 జనవరి 24న నిజాం, బ్రిటీష్ సైన్యాలు విరుచుకుపడ్డాయి. ఆ సైన్యాలను సాహసోపేతంగా ఎదుర్కొంటూ తుర్రెబాజ్ ఖాన్ శత్రువు సైనికుల తుపాకి గుండ్లకు బలయ్యారు. ఆ యోధుని పార్థివ శరీరాన్ని హైదరాబాదు నగరానికి తరలించి అంత్య క్రియలు ఏవీ జరపకుండా బలమైన ఇనుప గొలుసులతో కట్టేసి ప్రస్తుత సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట ఒక గుంజకు బహిరంగంగా వేలాడదీశారు. ప్రజలలో తిరుగుబాటు ఆలోచ నలు ఏ మాత్రం మళ్ళీ పొడచూపకుండా వారిలో భయోత్పాతం కల్గించేందుకు ఆంగ్లేయులు ఇటువంటి అత్యంత పాశవిక చర్యలకు పాల్పడ్డారు. చివరకు మాతృభూమి విముక్తి పోరాటం విజయవంతం కావడంతో భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర పుటలలో గౌరవప్రదమైన స్థానం పొందిన పఠాన్ తుర్రెబాజ్ ఖాన్ ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచారు. ✤

లాంగ్ మార్చ్

కవి కరీముల్లా

స్వప్నాలన్నీ కలగల్సి
మసకబారిన కళ్లను నులిమి
నిజాల పొద్దు చూసాక
మరుగుతున్న రక్తంతో
నేల నిండా విస్తరిస్తున్నాయి.
చలికి ముడుచుకుని కూర్చున్న
పికిలి పిట్టొకటి
హుషారుగా ఎగిరి
యుద్ధ సైరన్ మోగిస్తుంది.
కలలన్నీ కలతల్ని బ్యాగుల్లో సర్ది
నిర్వేదనల్ని ఆవలికి నెట్టేసి
నిప్పుల వంతెనపై నడుస్తున్నాయి
వణుకుతున్న తోడేళ్ళ సైగతో
గుంటనక్కల గుంపొకటి దిగంబరంగా మారి
అబద్ధాల మేకుల్ని టివి స్టూడియోల్లో నాటుతూ
పాలకుల పాదసేవ చేసుకుంటున్నాయి.
కలల జడివాన కురుస్తుంది
ఊర్లకు ఊర్లు వాగులౌతున్నాయి.
వాగులన్నీ ఛలో ఢిల్లీ అంటూ పొంగుతున్నాయి.
ఫాసిస్టు పాలకుల్లారా !
సమస్య నీట్ కాదు
ధ్వంసం కాబడ్డ వ్యవస్థ
సమాధి ఫలకంలా మారిన
భవిష్యత్తు.
దేశం దేశమంతా
మీరు చెరసాలలా మార్చాక
ఉరకలెత్తే యువతరాన్ని
నిర్బంధాలతో నిలేయలేవు.
జంతర్ మంతర్ సాక్షిగా
లాంగ్ మార్చ్ మొదలైంది
కాకి శవం చుట్టూ మూగిన
కాకుల గోల
కర్ణ కఠోరంగా మారి
సరికొత్త సూర్యుడ్ని ఆవిష్కరించుకుంటాయి..

జంతర్ మంతర్‌లో జ్వలిస్తున్న యువశక్తి!

ముహమ్మద్ అజిజుద్దీన్

దేశంలో లక్షలాది మంది విద్యార్థులు డాక్టర్ కావాలనే ఒకే ఒక్క కలతో సంవత్సరాల తరబడి రేయింబవళ్లు కష్టపడతారు. కుటుంబాలన్నీ తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక ఇబ్బందులను భరిస్తూ, కోచింగ్ ఫీజులు చెల్లిస్తూ, తమ ఆశలన్నింటినీ వారి విజయంపైనే ఉంచుతాయి. కానీ ఒక ప్రశ్నాపత్రం లీక్ ఆ లక్షలాది కుటుంబాల ఆశలను క్షణాల్లో ఛిద్రం చేస్తుంది. కష్టపడి చదివిన విద్యార్థి, అక్రమ మార్గంలో ప్రశ్నాపత్రం పొందిన వ్యక్తితో పోటీ పడాల్సి రావడం విద్యా వ్యవస్థకే అతిపెద్ద అవమానం. ఇది కేవలం పరీక్షలో జరిగిన లోపం కాదు దేశ యువత నమ్మకంపై జరిగిన దాడి.

ఒక విద్యార్థి విఫలమైతే అతడే బాధపడడు. అతని తల్లిదండ్రులు బాధపడతారు. అప్పులు చేసి చదివించిన కుటుంబాలు కన్నీరు పెడతాయి. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులు, కష్టపడి చదివినా న్యాయం జరగకపోతే ఇక మా పిల్లల భవిష్యత్తు ఏమిటి ? అని ప్రశ్నిస్తున్నారు. ఈ బాధ కేవలం ఒక కుటుంబానిదే కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాల వేదన. అందుకే నేడు యువత వీధుల్లోకి వచ్చింది. ఇది రాజకీయ పోరాటం కాదు తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి జరుగుతున్న పోరాటం.

గత ఇరవై రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ యువత ఆవేదనకు వేదికగా మారింది. ఎండను, వర్షాన్ని, అలసటను లెక్క చేయకుండా వేలాది మంది యువకులు, విద్యార్థులు అక్కడ శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్నారు. వారి చేతుల్లో ఆయుధాలు లేవు న్యాయం కోరే ప్లకార్డులు మాత్రమే ఉన్నాయి. వారి నినాదాల్లో ద్వేషం లేదు పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ కోసం వినిపిస్తున్న ఆవేదన మాత్రమే ఉంది. ఈ ఉద్యమం కేవలం ఒక పరీక్షకు పరిమితం కాదు. దేశంలో ప్రతిభకు గౌరవం దక్కాలనే, నిజాయితీగా కష్టపడిన వారికి న్యాయం జరగాలనే ఆకాంక్షకు ఇది ప్రతీక.

ఈ ఉద్యమానికి విద్యావేత్త, సంస్కర్త సోనం వాంగ్‌చుక్ మద్దతుగా నిలవడం విశేషం. లడాఖ్‌లో విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చిన ఆయన, యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు జీవితాన్ని అంకితం చేశారు. ఆయన యువతను హింసకు దూరంగా ఉండాలని, రాజ్యాంగ బద్ధంగా తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిస్తున్నారు. యువత ఆవేదనను దేశం వినాలని, వారి ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన చేసిన విజ్ఞప్తి ఉద్యమానికి మరింత నైతిక బలం చేకూర్చింది. సమాజంలో విశ్వసనీయత కలిగిన వ్యక్తులు యువతకు అండగా నిలవడం, ఈ పోరాటం ఎంత న్యాయబద్ధమైనదో తెలియజేస్తోంది.

అయితే, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ప్రజాస్వామ్యంలో విభేదించే స్వరాన్ని వినడం ప్రభుత్వ బాధ్యత. కానీ అదే స్వరాన్ని బలప్రయోగంతో అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. చేతిలో పుస్తకాలు పట్టాల్సిన విద్యార్థులు, లాఠీల దెబ్బలు తినాల్సిన పరిస్థితి రావడం ఏ సమాజానికీ గర్వకారణం కాదు. ప్రశ్నించే యువతను నేరస్థుల్లా చూడడం, వారిని చెదరగొట్టడానికి బలప్రయోగం చేయడం దేశ ప్రజాస్వామ్య ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది.

ఈ సంఘటన మరో కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది. యువత సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న స్పందన ఎందుకు అంత మందగిస్తోంది? లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన సమయంలో మౌనం ఎందుకు? యువతకు ఉపన్యాసాలు ఇవ్వడం సులభం. కానీ వారి బాధను అర్థం చేసుకొని, వారి ఆందోళనలకు పరిష్కారం చూపడం నిజమైన నాయకత్వం. దేశ అభివృద్ధి గురించి మాట్లాడే ప్రతి ప్రభుత్వం, ముందుగా దేశ యువత నమ్మకాన్ని కాపాడాలి. నమ్మకం కోల్పోయిన యువతతో ఏ దేశమూ దీర్ఘకాలిక అభివృద్ధి సాధించలేదు.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా గర్వపడుతోంది. ఆ యువశక్తే దేశానికి అతిపెద్ద సంపద. అలాంటి యువత తమ భవిష్యత్తు కోసం వీధుల్లో నిలబడితే, వారిని వినడం ప్రభుత్వాల బాధ్యత. వారిపై లాఠీలు ఎత్తడం కాదు, వారి సమస్యలకు పరిష్కారం చూపడం ప్రజాస్వామ్య ధర్మం. ఎందుకంటే లాఠీలతో శరీరాలను గాయపరచవచ్చు కానీ నిజం కోసం పోరాడే ఆలోచనను, న్యాయం కోసం నిలబడే యువశక్తిని ఎన్నటికీ అణచలేరు.

దేశ భవిష్యత్తు కేవలం పార్లమెంట్‌లో కాదు... జంతర్ మంతర్‌లో న్యాయం కోసం నిలబడ్డ ఆ యువకుల కళ్లల్లో కూడా కనిపిస్తోంది. వారి స్వరం వినిపించకపోతే, రేపటి భారతదేశం కోల్పోయేది కేవలం ఒక తరం కాదు ప్రతిభపై, న్యాయంపై, ప్రజాస్వామ్యంపై ఉన్న విశ్వాసాన్నే.

గాజా వీధుల్లో స్పెయిన్ విజయ భేరి!

కటిక చీకట్లను చీల్చుకుంటూ ఆశల వెలుగు రేఖ ఒకటి అంబరాన్ని తాకితే ఎలా ఉంటుందో... తీవ్ర ఆవేదనల నడుమ గాజా వీధుల్లో వెల్లివిరిసిన సంతోషం సరిగ్గా అలాగే ఉంది! బాంబుల మోతలు, తుపాకుల శబ్దాల మధ్య ప్రతిక్షణం మృత్యువుతో పోరాడే ఆ హృదయాలు ఒక్కసారిగా స్వేచ్ఛగా స్పందించాయి. స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టు 'వరల్డ్ కప్ 2026' విజయాన్ని సొంతం చేసుకున్న క్షణంలో... అది కేవలం ఒక ఆట గెలుపు మాత్రమే కాదు, పాలస్తీనా జాతి తల దించుకోకుండా నిలబెట్టిన 'మానవత్వపు గెలుపు'గా మారింది. గాజా వీధుల్లో మృత్యు నీడలు పరుచుకున్నా, ఇస్రాయెల్ వైమానిక దాడుల ముప్పు పొంచి ఉన్నా... భయాన్ని తరిమేసి, స్పెయిన్ జెండాలను పట్టుకుని యువత రోడ్లపైకి వచ్చారు. స్పెయిన్ జట్టు విజయాన్ని తమ సొంత గెలుపుగా భావించి సంబరాలు చేసుకున్నారు. ఈ అపూర్వ బంధానికి బలమైన పునాది 'మానవత్వం'. పాలస్తీనా హక్కుల కోసం, ఆ ప్రజల జీవించే హక్కు కోసం ఐరోపా ఖండంలో స్పెయిన్ గళమెత్తింది. అంతేకాదు, స్పెయిన్ యువ క్రీడాకారుడు లామిన్ యమాల్ మైదానంలో పాలస్తీనా జెండాను పట్టుకుని ప్రపంచానికి చూపించిన సంఘీభావం ఆ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. "పాలస్తీనా జెండాను ఎత్తిపట్టిన ప్రతి చేతికి ప్రపంచ కప్‌ను ఎత్తే హక్కు ఉంది" అని అంగవైకల్యాన్ని జయించిన గాజా ఫుట్‌బాల్ క్రీడాకారులు చెప్పిన మాటలు ప్రతీ ఒక్కరి హృదయాలను ద్రవీంపజేస్తాయి.

ఇస్రాయిల్ దాడులకు సర్వస్వం కోల్పోయి గుడారాల్లో జీవిస్తున్న కోట్లాది మందికి, ఈ వార్త ఒక చిన్న శ్వాసలా, ఊరట కలిగించే అమృతంలా అనిపించింది. విద్యుత్ లేదు, నెట్‌వర్క్ లేదు... అయినా ఇంటర్నెట్ కేఫ్‌ల వద్దకు వెళ్లి మ్యాచ్ హైలైట్స్ చూసి, "స్పెయిన్ గెలిచింది" అని తెలిసిన క్షణంలో ఆనంద బాష్పాలు రాల్చిన యువతుల కళ్లల్లో కనిపించిన వెలుగు సామాన్యమైనది కాదు!

అక్కడ రాత్రివేళ సంబరాలు చేసుకునేంత శాంతి లేదు, ఎప్పుడు ఏ బాంబు పడుతుందో తెలియని భయం... అయినా, ఆ ఒక్క విజయం వారిలో జీవితం పట్ల, మానవత్వం పట్ల ఆశను రగిలించింది. స్పెయిన్ సాధించిన ఈ విజయం, ధర్మానికి, మానవతా విలువలకి లభించిన మహోన్నత గౌరవం!

అల్లాహ్ తాలా పవిత్ర ఖురాన్‌లో న్యాయం (అద్ల్), దయ (అహ్సాన్) ప్రదర్శించాలని ఆదేశించాడు (సూరా అన్-నహ్ల్: 90). హజ్రత్ అలీ (రజి) వ్యాఖ్యానం ప్రకారం- న్యాయం అంటే మనిషిపై విధిగా ఉన్న బాధ్యతలను నెరవేర్చడం; దయ అంటే అంతకంటే ముందుకెళ్లి, మరింత మెరుగైన, సద్భావనాత్మక మార్గాన్ని ఎంచుకోవడం. కేవలం చట్టబద్ధమైన హక్కుల చెల్లింపుపైనే ఏ కుటుంబ బంధమూ నిలబడలేదు. ఆ పరిమితులను దాటి దయాగుణంతో వ్యవహరించినప్పుడే జీవిత చక్రం సాఫీగా సాగుతుంది.

ముఖ్యంగా ఇంటి వాతావరణంలో భార్యాభర్తలు, అత్తమామలు, ఆడపడుచులు, ఇతర కుటుంబ సభ్యులు ఒకరికొకరు తోడ్పడటం, పరస్పరం గౌరవించుకోవడం, ప్రేమను వ్యక్తపరచడం, సదభిప్రాయంతో మసలుకోవడం అత్యంత ఆవశ్యకం. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవడం, ఇతరులు తమ హక్కులను నెరవేర్చడంలో విఫలమైనా క్షమాగుణంతో వ్యవహరిస్తూ, చిన్న చిన్న తప్పులను విస్మరించడం ఎంతో ముఖ్యం.

సంతోషకరమైన వైవాహిక జీవితం కోసం అనుసరించాల్సిన కొన్ని ముఖ్యమైన నైతిక బాధ్యతలు:

1. పరస్పర సహకారం

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి), అల్లుడు హజ్రత్ అలీ (రజి)ల మధ్య గృహ బాధ్యతలను విభజించారు. హజ్రత్ అలీ (రజి) బయటి పనులను, హజ్రత్ ఫాతిమా(రజి) గృహాంతర్గత పనులను పర్యవేక్షించేవారు. ముస్నద్ అహ్మద్ ప్రకారము: వంట చేయడం, పాత్రలు తోమడం, దుస్తులు ఉతకడం, ఇల్లు శుభ్రం చేయడం వంటివి భార్య బాధ్యతలు కాగా; ఆర్థికాభివృద్ధి కోసం శ్రమించడం, నిత్యావసరాలు తీసుకు రావడం వంటి బయటి పనులు భర్త బాధ్యతలు. అయినప్పటికీ, ఈ పనుల్లో ఒకరికొకరు సాయపడటం అనేది వారి మధ్య ఉన్న ప్రేమ, అనురాగానికి ప్రతీక.

హజ్రత్ ఆయిషా (రజి) ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)

జీవనశైలిని వివరిస్తూ-''ఆయన ఇంట్లో సాధారణ పనివారిలా సాయం చేసేవారు. కానీ అజాన్ (ప్రార్థన పిలుపు) వినబడగానే నమాజ్ కోసం మసీదుకు బయలుదేరేవారు'' అని తెలిపారు (సహీహ్ అల్-బుఖారీ). అంతేకాక, ప్రవక్త వారు తమ చెప్పులను స్వయంగా కుట్టుకునేవారు, దుస్తులకు మాసికలు వేసుకునేవారు.

2. పరస్పర ఆలోచనా విమర్శ

ఏదైనా ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు జీవిత భాగస్వామితో సంప్రదించాలని ఇస్లాం ఆదేశిస్తోంది (సూరా ఆల్-ఇమ్రాన్: 159). భార్యాభర్తలిద్దరూ పరస్పరం చర్చించుకుని సంయుక్తంగా నిర్ణయాలు తీసుకోవాలి. భార్యాభర్తలు తమ నైతిక సంబంధాలను పవిత్రంగా ఉంచుకోవడం కూడా పుణ్యకార్యమేనని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించారు.

ఒక సందర్భంలో హ్రజత్ ఉమర్ (రజి) తన కుమార్తె హ్రజత్ హఫ్సా (రజి)ను- ఒక స్త్రీ తన భర్తకు దూరంగా గరిష్టంగా ఎంతకాలం ఉండగలదని అడుగగా, ఆమె "నాలుగు నెలలు" అని సమాధానమిచ్చారు. దాని ఆధారంగానే హ్రజత్ ఉమర్ (రజి) సైనికులకు ప్రతి నాలుగు నెలలకొకసారి తప్పనిసరిగా ఇంటికి వెళ్లేందుకు సెలవులు మంజూరు చేసేవారు. భర్త తన భార్యకు నాలుగు నెలల కంటే ఎక్కువ కాలం దూరంగా ఉండటం తగదని ఇస్లామిక్ పండితులు స్పష్టం చేశారు.

ఉత్తమ భార్య లక్షణం:

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉత్తమమైన భార్య గురించి తెలుపుతూ- ''భర్త ఆమె వైపు చూసినప్పుడు సంతోషాన్ని కలిగిస్తూ, భర్త చెప్పే మంచి మాటలకు విధేయత చూపుతూ, భర్త లేని సమయంలో తన మానప్రాణాలను, భర్త ఆస్తిపాస్తులను కాపాడుకునే స్త్రీయే ఉత్తమమైన భార్య'' అని సెలవిచ్చారు (అబూ దావూద్: 1664).

3. పరస్పర అలంకరణ, శోభ

అందాన్ని ఆస్వాదించడం మానవ నైజం. అందువల్ల భార్యాభర్తలిద్దరూ షరియా హద్దుల్లో ఉంటూ ఒకరి కోసం ఒకరు అందంగా సిద్ధమవ్వాలి. పవిత్ర ఖురాన్ వ్యాఖ్యాత హ్రజత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఇలా అన్నారు: ''నా భార్య నా కోసం ఎలా అలంకరించుకుంటుందో, నేను కూడా నా భార్య సంతోషం కోసం అలాగే అందంగా తయారవుతాను'' (తఫ్సీర్ అల్-కుర్తుబీ).

4. ఒకరినొకరు సంతోషపెట్టుకోవడం

ఆనందకరమైన వైవాహిక జీవితం దేవుడిచ్చిన ఒక అమూల్యమైన వరం. కాబట్టి, భార్యాభర్తలిద్దరూ నిరంతరం ఒకరినొకరు సంతోషపరచడానికి ప్రయత్నించాలి. భార్యను సంతోషంగా ఉంచడం భర్త ధర్మం.

5. వినోదం - మానసికోల్లాసం

వైవాహిక బంధాన్ని బలోపేతం చేయడానికి, జీవితంలో ఉత్సాహాన్ని నింపడానికి భర్త తన భార్య కోసం తగిన వినోద మార్గాలను ఏర్పాటు చేయడం అవసరం. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హ్రజత్ ఆయిషా (రజి)తో సరదాగా పరుగు పందెం వేసేవారని హదీసుల్లో ప్రస్తావించబడింది. అలాగే ఒక ఈద్ పండుగ సందర్భంలో హ్రజత్ ఆయిషా (రజి)కి ఇథియోపియా (హబ్షా) వారి సాంప్రదాయ క్రీడలను చూపించారు.

అందువల్ల భార్యాభర్తలు అప్పుడప్పుడు ఆహ్లాదకరమైన ప్రదేశాలకు వెళ్తుండాలి. ఇది వారి మధ్య ప్రేమను పెంపొందించి, మనసుకు, శరీరానికి నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది.

6. గుణాలను గుర్తించడం - లోపాలను క్షమించడం

ఒకరిలోని మంచి గుణాలను హృదయపూర్వకంగా అంగీకరిస్తూ, బలహీనతలను విస్మరించాలి. ఏ మానవుడూ పరిపూర్ణుడు కాడు; అల్లాహ్ ప్రతి పురుషుడిలో, స్త్రీలో నైతిక గుణాలతో పాటు కొన్ని లోపాలను కూడా ఉంచాడు. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ తాలా ఇలా సెలవిచ్చాడు:

''వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు. (సూరా అన్-నిసా: 19)

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

29 ఆయత్‌లు **మదీనా అవతరణ**

48. అల్ ఫత్‌హ్

25 వారేకదా తిరస్కరించినవారు, మిమ్మల్ని మస్జిదుల్ హరామ్ నుండి ఆపినవారు, "హద్‌యు" ఒంటెల్ని వాటి త్యాగస్థలానికి చేరనివ్వనివారు. ఒకవేళ మీరు ఎరుగనటువంటి విశ్వాసులయిన పురుషులు స్త్రీలు (మక్కాలో) లేకపోయి ఉన్నట్లయితే తెలియకపోయి మీరు వారిని కాలరాస్తారన్న ప్రమాదం లేకపోయినట్లయితే దీనివల్ల మీకు మాట వస్తుందన్న ప్రమాదమూ లేకపోతే (యుద్ధం ఆపడం జరిగేదికాదు. అది ఆపడానికి కారణం) తద్వారా అల్లాహ్ తన కారుణ్యంలో తాను కోరినవారిని ప్రవేశింపజేయాలన్నది. ఆ విశ్వాసులు వేరయిపోయి ఉన్నట్లయితే (మక్కావాసుల్లో) తిరస్కారులయినవారికి మేము ఖచ్చితంగా కఠినశిక్ష విధించేవారము.[44]

(44వ పాదసూచిక గత సంచిక తరువాయి)

ఇమామ్ మాలిక్ ప్రకారం ఇటువంటి పరిస్థితిలో గుండ్లు కురిపించరాదు. దీనికి ఆయన ఇదే ఆయత్‌ని ఆధారంగా చూపుతారు. అల్లాహ్ ముస్లిములను కాపాడటానికేగా హుదైబియాలో యుద్ధాన్ని ఆపాడు (అహ్కాముల్ ఖుర్‌ఆన్ : ఇబ్నుల్ అరబి) అన్నదే ఆయన వాదన. కాని వాస్తవానికి ఇదొక బలహీనమయిన వాదన. ఇటువంటి పరిస్థితిలో దాడిచేయడం నిషిద్ధం (హరామ్) అనీ లేదా ధర్మసమ్మతం కాదని తెలిపే ఏ పదమూ ఇందులో లేదు. మహా అయితే దీనిద్వారా తెలిసివచ్చే విషయం ఏమిటంటే, ఇటువంటి పరిస్థితిలో ముస్లిములను కాపాడటానికి దాడి జరపకుండా మానుకోవడానికి వీలుందని మాత్రమే చెప్పవచ్చు. అయితే ఇలా మానుకోవడం చేత తిరస్కా రులకు ముస్లిముల పైన అధీనం ప్రాప్తమయ్యే ప్రమాదం ఉండరాదు, లేదా ముస్లిములు వారిని జయించే అవకాశాలు లుప్తమయి పోరాదు.

ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ జుఫర్, ఇమామ్ ముహమ్మద్ (రహ్మ)ల ప్రకారం, ఇటువంటి పరిస్థితుల్లో గుండ్లు కురిపించడం పూర్తిగా ధర్మసమ్మతమే. కడకు, తిరస్కారులు ముస్లిముల బాలల్ని డాలుగా చేసుకుని ముందుకు తెచ్చినా వారిపై దాడి చేయడంలో తప్పులేదు. మరి ఏ ముస్లిములయితే ఈ స్థితిలో హతులవుతారో వారి ప్రాణహానికి ఎటువంటి ప్రాయశ్చిత్తంగాని, హత్యా పరిహారంగాని ముస్లిములపైన విధితమవదు. *(అహ్కాముల్ ఖుర్‌ఆన్ : జస్సాస్ కితాబుస్‌సియర్ : ఇమామ్ ముహమ్మద్ – కతఅల్ మాఅ' అన్ అహలిల్ హర్బ్).*

ఇమామ్ సుఫ్యాన్ సౌరి కూడా ఇటువంటి పరిస్థితుల్లో గుండ్లు కురిపించడం ధర్మసమ్మతమని అభిప్రాయపడతారు. అయితే ఇలాంటి పరిస్థితిలో హతులయిన ముస్లిములకు హత్యాపరిహారమయితే లేదు కాని ప్రాయశ్చిత్తం ముస్లిములకు విధితమే అని అంటారు. (అహ్కాముల్ ఖుర్‌ఆన్ : జస్సాస్)

ఇమామ్ ఔజాయి, లైస్ బిన్ సఅద్ ప్రకారం, తిరస్కారులు ముస్లిములను డాలుగా వినియోగించుకుని ముందుకు తెస్తే వారిపైన గుండ్లు పేల్చరాదు. అలాగే వారి యుద్ధ నౌకలో ముస్లిమ్ ఖైదీలు కూడా ఉన్నారని తెలిస్తే ఇటువంటి పరిస్థితిలో దాన్ని ముంచివేయరాదు. కాని ముస్లిములు ఏదయినా నగరాన్ని ముట్టడిస్తే ఆ నగరంలో ముస్లిములున్నారని తెలిసినా దానిపైన గుండ్లు కురిపించడం ధర్మసమ్మతమే. ఎందుకంటే ముస్లిములు వేసే గుండ్లు ముస్లిములపైనే పడుతాయన్న విషయం నిశ్చితం కాదు. ముస్లిములెవరయినా ఈ గుండ్లకు గురయినట్లయితే ఇది కావాలని ముస్లిములను సంహరించినట్లు కాదు, తెలియక పోవడంచేత జరిగిన దుర్ఘటన. *(అహ్కాముల్ ఖుర్‌ఆన్ : జస్సాస్)*

ఇమామ్ షాఫియీ అభిప్రాయంలో, ఇటువంటి పరిస్థితిలో దాడి జరపడం తప్పనిసరి కాకపోయినట్లయితే ముస్లిములను సంహారం నుండి కాపాడే ప్రయత్నం చేయడం ఉత్తమం. ఇటువంటి పరిస్థితుల్లో గుండ్లు కురిపించడం హరామ్ కాకపోయినప్పటికీ 'మక్రూహ్' అవడం నిశ్చయమే. కాని వాస్తవంగా ఇది అవశ్యమయినట్లయితే, అలా చేయకపోతే ఇది తిరస్కారులకు యుద్ధం రీత్యా ప్రయోజనకరం, ముస్లిములకు నష్టకరమయినట్లయితే ఇక గుండ్లు కురిపించడం ధర్మసమ్మతమే. అప్పుడు కూడా ముస్లిములను కాపాడే కృషిమటుకు శాయశక్తులా చేయవలసిందే. ఇంకా ఇమామ్ షాఫియీ ఇలా కూడా అంటున్నారు, రణ రంగంలో తిరస్కారులు ముస్లిములను డాలుగా వినియోగిం చుకుని ముందుకు తెచ్చినప్పుడు, ముస్లిములు వారిని సంహరిస్తే అందులో రెండు పరిస్థితులూ ఎదురు కావచ్చు, ఒకటి, సంహరించే వారికి వారు ముస్లిములని తెలిసి ఉండటం, రెండు, వారు ముస్లిములని తెలియకపోవడం. మొదటి పరిస్థితిలో పరిహారమూ ప్రాయశ్చిత్తమూ రెండు విధితమవుతాయి. రెండవ పరిస్థితిలో కేవలం ప్రాయశ్చిత్తం విధితమవుతుంది. (ముగ్‌ని అల్ ముహ్తాజ్).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيْرِ
ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

13. అర్రాద్ సూరా

అల్లాహ్ సర్వజ్ఞాని

అల్లాహ్‌కు ప్రతి గర్భిణీ యొక్క గర్భాన్ని గురించి తెలుసు; అందులో తయారయ్యేది కూడా ఆయనకు తెలుసు; అందులో జరిగే హెచ్చు తగ్గులను గురించి కూడా ఆయనకు తెలుసు. ఆయన వద్ద ప్రతి వస్తువు కొరకు ఒక పరిమాణం నిర్ణయమై ఉన్నది. ఆయన గోప్యంగా ఉన్నటువంటి, బహిరంగంగా ఉన్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసిన పండితుడు, ఆయన గొప్పవాడు. ***(13: 8,9)***

539) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "అగోచరాలకు సంబంధించిన అయిదు తాళం చెవులు ఉన్నయ్. వాటిని గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.

★ రేపు ఏం జరగనున్నదో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.

★ మాతృ గర్భాశయాలలో జరిగే హెచ్చుతగ్గుల గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.

★ వర్షం ఎప్పుడు కురుస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.

★ తనను మృత్యువు ఎప్పుడు కబళిస్తుందో ఏ వ్యక్తికీ తెలీదు.

★ ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు."[1]

539-1. అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. వేరితరులకు ఈ జ్ఞానం ఉందన్న నమ్మకం కలిగి ఉన్నవాడు అబద్ధీకుడు. దైవప్రవక్తలకు సయితం అగోచర విషయాల జ్ఞానం లేదు. కాకపోతే అల్లాహ్ 'వహీ' ద్వారా తాను కోరిన ప్రవక్తకు దానిని తెలియపరుస్తాడు.

భారతదేశంలో సమకాలీన సామాజిక సమస్యలు ఇస్లామ్ పరిష్కారం

- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

గత సంచిక తరువాయి

3. వైవాహిక నమ్మకద్రోహం- అక్రమ సంబంధాలు

మానవ నాగరికతకు కుటుంబమే ప్రాథమిక వ్యవస్థ. ఆ వ్యవస్థ సుదృఢంగా నిలవడానికి భార్యాభర్తల మధ్య పరస్పర విశ్వాసం, నిబద్ధత, శీల సంరక్షణ అత్యంత కీలకమైన ఆధారం. వైవాహిక బంధంలో విశ్వసనీయత లోపించినప్పుడు కేవలం ఇద్దరు వ్యక్తుల సంబంధం మాత్రమే దెబ్బతినదు; పిల్లల మానసిక స్థితి, కుటుంబ వ్యవస్థ స్థిరత్వం, అంతిమంగా సమాజం మొత్తం దీని దుష్పరిణామాల బారిన పడతాయి.

ఆధునిక ప్రపంచంలో మీడియా, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు (సోషల్ మీడియా), డేటింగ్ యాప్‌లు, అశ్లీలత, హద్దులు లేని స్త్రీ-పురుషుల స్వేచ్ఛా పరిచయాలు అక్రమ సంబంధాలను పూర్వం కంటే సులభతరం చేశాయి. దీని పర్యవసానంగా నమ్మకద్రోహం, విడాకులు, గృహ హింసతో పాటు కొన్నిసార్లు హత్యల వంటి ఘోరమైన నేరాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

సమకాలీన పరిశోధనలు ఈ సమస్య తీవ్రతను కళ్ళకు కడుతున్నాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా అశ్లీల (పోర్నోగ్రఫీ) రంగం ఏటా బిలియన్ల డాలర్ల పరిశ్రమగా రూపాంతరం చెందింది. లక్షలాది వెబ్‌సైట్లను ప్రతిరోజూ కోట్ల మంది వీక్షిస్తున్నారు. నిరంతర అశ్లీల వీక్షణకు, వైవాహిక అసంతృప్తికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడించాయి. ఇది అవాస్తవిక లైంగిక అంచనాలను పెంచి, కొన్ని సందర్భాల్లో వైవాహిక నమ్మకద్రోహానికి దారితీస్తోంది.

భారత జాతీయ నేర రికార్డుల బ్యూరో (NCRB), పలు రాష్ట్రాల పోలీస్ నివేదికల ప్రకారం- ఇటీవలి కాలంలో జరుగుతున్న కొన్ని హత్యల వెనుక అక్రమ సంబంధాలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. హత్యలకు ఆర్థిక వివాదాలు, కుటుంబ కలహాలు, భూ తగాదాలు, ఇతర అంశాలు కూడా కారణాలైనప్పటికీ, నమ్మక ద్రోహం వల్ల జరిగే నేరాల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. ఈ గణాంకాలన్నీ నైతిక పతనం అనేది కేవలం వ్యక్తిగత పాపానికే పరిమితం కాదని, అది సమాజాన్ని పీడిస్తున్న ఒక తీవ్రమైన సామాజిక వ్యాధిగా మారిందనే సత్యాన్ని నిరూపిస్తున్నాయి.

వైవాహిక నమ్మకద్రోహానికి దారితీసే వివిధ కారణాలు:

ఈ సమస్యకు అనేక కారణాలు ఉండవచ్చు. వాటిలో కొన్ని: జవాబుదారీతనం అనే భావన లోపించడం, వివాహానికి ముందే అక్రమ సంబంధాలను ఒక సాధారణ విషయంగా భావించడం, ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా రహస్య పరిచయాలు పెంచుకోవడం, అశ్లీలతకు (పోర్నోగ్రఫీ) బానిస కావడం, సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నమ్మకద్రోహాన్ని ఆకర్షణీయంగా, శృంగారభరితంగా చూపించడం, వైవాహిక విభేదాలను పరస్పర

చర్చల ద్వారా కాకుండా అక్రమ సంబంధాల ద్వారా పరిష్కరించు కోవడానికి ప్రయత్నించడం, నైతిక పరిమితుల కంటే శారీరక వాంఛలకే ప్రాధాన్యత ఇవ్వడం మొదలైనవి.

అశ్లీలత (పోర్నోగ్రఫీ) అనేది కేవలం ఒక నైతిక లోపం మాత్రమే కాదు, అదొక మానసిక, సామాజిక సమస్యగా పరిణమించింది. దీనివల్ల జీవిత భాగస్వామి పట్ల అసంతృప్తి ఏర్పడటంతో పాటు, అవాస్తవికమైన లైంగిక అంచనాలు తలెత్తుతాయి. ఫలితంగా వైవాహిక బంధం తీవ్రంగా దెబ్బతింటుంది. కొందరు దీనికి పూర్తిగా బానిసలుగా (Addiction) మారిపోతారు, ఇది అక్రమ సంబంధాలకు దారితీసే అవకాశాలను పెంచుతుంది. కేవలం సుఖం కోసం అలవాటు చేసుకునే ఈ అశ్లీల వీక్షణే, పురుషులలో లైంగిక సామర్థ్యాన్ని (నపుంసకత్వం వైపు) గణనీయంగా కుంగ దీస్తుందని కూడా పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీని నివారణకు అశ్లీలతకు పూర్తిగా దూరంగా ఉండటమే ఏకైక మార్గంగా సూచించబడుతోంది. వైద్యశాస్త్రం నేడు దేనినైతే నివారణోపాయంగా చెప్తోందో, ఇస్లాం ఆ నష్టాల దరిదాపుల్లోకి కూడా వెళ్ళవద్దని ఎప్పుడో హెచ్చరించింది. అంటే, వ్యాధి వచ్చాక చికిత్స చేయడం కంటే- వ్యాధి రాకుండా ముందే జాగ్రత్త పడాలనే (Precaution) సూత్రాన్ని ఇస్లాం అందిస్తుంది.

ఖురాన్ దృక్పథం:

ఇస్లాం కేవలం వ్యభిచారాన్ని మాత్రమే నిషిద్ధం (హరామ్) చేయలేదు, పైగా దానికి దారితీసే అన్ని మార్గాలను మరియు అవకాశాలను సైతం పూర్తిగా మూసివేసింది. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా ఆజ్ఞాపించాడు:

“మరియు మీరు వ్యభిచారం దరిదాపుల్లోకి కూడా వెళ్ళకండి. నిశ్చయంగా అది అత్యంత నిర్లజ్జకరమైన కార్యం, ఎంతో చెడ్డ మార్గం.” (సూరా అల్-ఇస్రా: 32)

ఇక్కడ గమనించాల్సిన గంభీరమైన విషయమేమిటంటే, ఖురాన్ కేవలం “వ్యభిచారం చేయకండి” అని చెప్పలేదు, బదులుగా “దాని దరిదాపుల్లోకి కూడా వెళ్ళకండి” అని హెచ్చరించింది. అంటే, మానవుడిని ఆ ఘోర పాపం వైపు నడిపించే, ప్రేరేపించే అన్ని రకాల సాధనాలు, పరిస్థితులు , మార్గాల నుండి సంపూర్ణంగా దూరంగా ఉండాలని బోధించింది.

అదేవిధంగా అల్లాహ్ మరొక చోట ఇలా సెలవిచ్చాడు: “(ఓ ప్రవక్తా!) విశ్వాసులైన పురుషులతో చెప్పు- వారు తమ చూపులను అదుపులో ఉంచుకోవాలని (క్రిందికి వాల్చుకోవాలని) మరియు తమ మర్మాంగాలను సంరక్షించుకోవాలని.” (అన్-నూర్: 30)

ఈ ఆజ్ఞను అనుసరిస్తూనే, ఆ తర్వాతి ఆయత్‌లో విశ్వాసులైన స్త్రీలకు కూడా ఇదే విధమైన ఆదేశం ఇవ్వబడింది. ఈ దైవిక నియమాలు మానవ నైజాన్ని, మనస్తత్వాన్ని దృష్టిలో ఉంచుకొని, సమాజ నైతిక బంధాన్ని కాపాడటం కోసమే విధించబడ్డాయి.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారు ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ ఇలా సెలవిచ్చారు:

“కళ్ళు కూడా వ్యభిచారం చేస్తాయి; నిషిద్ధమైన వాటిని చూడటమే వాటి వ్యభిచారం.” (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

శీల సంరక్షణకు కళ్ళను అదుపులో ఉంచుకోవడం అనేది అత్యంత ప్రాథమికమైన మొదటి అడుగు. అంతిమంగా, కళ్ళ దొంగ చూపులను (కళ్ళ మోసాన్ని) మాత్రమే కాకుండా, హృదయాల అంతరాళాల్లో దాగివున్న రహస్యాలను సైతం సంపూర్ణంగా ఎరిగిన సృష్టికర్తతోనే మనకు సంబంధం ఉందనే సత్యాన్ని ఇస్లాం గుర్తుచేస్తోంది.

పరిష్కారం:

ఇస్లాం ఈ సమస్యకు కేవలం శిక్షల ద్వారా మాత్రమే కాకుండా, సమగ్రమైన నైతిక శిక్షణ ద్వారా పరిష్కారం చూపుతుంది. అల్లాహ్ ప్రతి క్షణం తనను గమనిస్తున్నాడనే దృఢమైన విశ్వాసం మనిషిలో ఉన్నప్పుడు, అతను ఏకాంతంలో సైతం పాపానికి ఒడిగట్టడానికి సాహసించడు. పాపానికి పునాది పడే తొలి దశలోనే దానిని అడ్డుకోవడానికి ఇస్లాం చూపులను అదుపులో ఉంచుకోవాలని ఆజ్ఞాపించింది. యువత తమ సహజమైన శారీరక వాంఛలను పవిత్రమైన మార్గంలో తీర్చుకోవడానికి ప్రవక్త ముహమ్మద్ (స) వారు వివాహాన్ని ప్రోత్సహించారు.

వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య పరస్పర ప్రేమాభిమానాలు, గౌరవం, సద్ప్రవర్తన, ఒకరి మానసిక, శారీరక అవసరాలను మరొకరు గుర్తించి గౌరవించడం వల్ల ఆ బంధం మరింత సుదృఢమవుతుంది. ఇది వారిని అక్రమ ప్రలోభాల బారిన పడకుండా రక్షిస్తుంది. మీడియా, ఇంటర్నెట్, సంభాషణలు లేదా సామాజిక వాతావరణం- ఏ రూపంలోనైనా సరే, సమాజంలో అశ్లీలతను, నిర్లజ్జను వ్యాప్తి చేసే ప్రతి విషయానికి దూరంగా ఉండాలని ఇస్లాం బోధిస్తుంది.

ఈ క్రమంలో ఇస్లాం అందించిన అత్యంత కీలకమైన మార్గదర్శకం ఏమిటంటే- ఏకాంతంలో పరాయి స్త్రీ-పురుషులు (షరియత్ ప్రకారం వివాహం నిషిద్ధం కానివారు) కలుసుకోకూడదు. పరాయి స్త్రీ-పురుషులు ఏకాంతంలో కలుసుకునే అవకాశం లేకపోతే, లోకంలో ఎలాంటి శృంగారభరిత కథలు, నవలలు లేదా చలన

చిత్రాలు పుట్టుకొచ్చే ప్రసక్తే లేదు. అక్రమ సంబంధాలనే అనర్థానికి బీజం పడే ఆ ప్రాథమిక కారణాన్ని (ఏకాంత భేటీలను) ఇస్లాం వేరుతో సహా పెకలించివేసింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, షరియత్ (దైవిక చట్టం) ముఖ్య ఉద్దేశ్యం- ఏకాంత కలయికలపై ఆంక్షలు విధించడం ద్వారా ఏ అవివాహిత యువతి లేదా వివాహిత స్త్రీ శీలానికి, పవిత్రతకు ఎలాంటి కళంకం లేదా అనుమానం రాకుండా కాపాడటమే.

ఒకవేళ మానసిక బలహీనత కారణంగా ఏదైనా పాపం సంభవించినా, ఇస్లాం ఆ పాపాత్ముడికి సంస్కరణ మార్గాలను ఎన్నటికీ మూసివేయదు. అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా ప్రకటిస్తున్నాడు:

“తమ ఆత్మలపై తామే అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల మీరు నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు.” (సూరా అజ్-జుమర్: 53)

అల్లాహ్ తాలా పశ్చాత్తాపం (తౌబా), క్షమాపణల (ఇస్తిగ్ఫార్) ద్వారా ఆత్మశుద్ధి (తజ్కియా-ఎ-నఫ్స్) చేసుకునే మార్గాలను సదా తెరిచే ఉంచాడు.

వైవాహిక విశ్వసనీయత అనేది ఒక సుదృఢమైన, ప్రశాంతమైన, సంపన్నమైన సమాజానికి మూలాధారం. ఈ నిబద్ధత లోపించినప్పుడు పరస్పర నమ్మకం విచ్ఛిన్నమవుతుంది, కుటుంబ వ్యవస్థలు కూలిపోతాయి, పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుంది; కొన్ని సందర్భాల్లో ఘోరమైన నేరాలు సైతం ఉద్భవిస్తాయి. ఆధునిక నాగరికత స్వేచ్ఛా వాంఛలకు అమితమైన ప్రాధాన్యతనిచ్చింది; కానీ దానితో పాటు వచ్చే నైతిక బాధ్యతల నుండి పురుషులను బాధ్యతారహితులుగా, నిర్లక్ష్యపరులుగా మార్చేసింది. ఈ బాధ్యతారాహిత్యానికి పర్యవసానంగా స్త్రీలు, అమాయక చిన్నారులు నిరంతరం నలిగిపోతున్నారు.

ఇస్లాం ఈ సంక్షోభానికి అత్యంత సమగ్రమైన పరిష్కారాన్ని అందిస్తుంది. దైవవిశ్వాసం (ఈమాన్), దైవభీతి (తఖ్వా), లజ్జ (హయా), చూపుల సంరక్షణ, వివాహాన్ని సులభతరం చేయడం, భార్యాభర్తల పరస్పర హక్కుల నెరవేర్పు, పశ్చాత్తాపం, దైవసన్నిధిలో జవాబుదారీతనం వహిస్తామనే అంతర్గత భావన- ఇవే ఒక పవిత్రమైన కుటుంబాన్ని, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించగల సుదృఢమైన పునాదులు.

సచ్చరితులైన విశ్వాసులు సాఫల్యం పొందారని ఖురాన్ స్పష్టం చేస్తోంది. వారి విశిష్ట గుణగణాలలో అత్యంత కీలకమైనది శీల సంరక్షణ:

“తమ మర్మాంగాలను పరిరక్షించుకుంటారు- తమ భార్యల, తమ అధీనంలో ఉన్న స్త్రీల విషయంలో తప్ప. వీరి విషయంలో పరిరక్షించు కోని పక్షంలో వారు నిందార్హులు కారు. అయితే ఎవరైనా దీనిని మించి కోరుకుంటే వారే అత్యాచారం చేసేవారు- తమ అమానతులకు, తమ వాగ్దానాలకు కట్టుబడి ఉంటారు, తమ నమాజులను శ్రద్ధగా కాపాడుకుంటారు. వారే స్వర్గాన్ని వారసత్వంగా పొందేవారు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు..” (అల్-ముమినూన్: 5-11)

4. లంచగొండితనం - అవినీతి

లంచగొండితనం, అవినీతి ఏ దేశఆర్థిక వ్యవస్థనైనా చెదపురుగులా అంతర్గతంగా గుల్లచేస్తాయి. ఇది కేవలం ఒక నైతిక లోపం మాత్రమే కాదు; సంపద సమన్యాయ పంపిణీని, ప్రభుత్వ సంస్థల జవాబుదారీతనాన్ని, పెట్టుబడులను, ఉపాధి అవకాశాలను, జాతీయ ప్రగతిని తీవ్రంగా దెబ్బతీసే ఒక వ్యవస్థాగత ఆర్థిక నేరం. సామాన్య ప్రజలు తమ జీవితకాలమంతా రక్తాన్ని చెమటగా మార్చి కూడా సంపాదించలేని అపార సంపదను, కొందరు అవినీతి అధికారులు కేవలం ఒక్క ఒప్పందంలో, ఎటువంటి శ్రమ లేకుండా అక్రమ మార్గాల్లో ఆర్జిస్తున్నారు. ఫలితంగా జాతీయ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైపోతుండగా, సామాన్య పౌరులు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం వంటి దుర్భర భారాల కింద నలిగిపోతున్నారు.

అవినీతి కారణంగా ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టుల వ్యయం కృత్రిమంగా పెరిగిపోతుంది. ఉదాహరణకు ఒక రహదారి, వంతెన, ఆసుపత్రి లేదా పాఠశాల నిర్మాణానికి వంద కోట్ల రూపాయలు ఖర్చు కావాల్సి ఉండగా, అందులో 20 నుండి 30 శాతం నిధులు కమిషన్లు, లంచాల రూపంలో చేతులు మారితే- ఆ ప్రాజెక్టు అత్యంత నాణ్యతా లోపంతో నిర్మితమవుతుంది, లేదా ప్రజలు దానికోసం అదనపు పన్నుల రూపంలో భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది.

లంచగొండితనం వల్ల పేదవాడు మరింత పేదరికంలోకి నెట్టబడతాడు; ఎందుకంటే వాడు తన చట్టబద్ధమైన హక్కును లేదా అర్హతను పొందేందుకు కూడా లంచం ఇచ్చుకోవాల్సిన దైన్యం ఏర్పడుతుంది. మరోవైపు, బలవంతులు, ధనవంతులు తీవ్రమైన నేరాలకు పాల్పడినా చట్టం లొసుగులను వాడుకుని సులభంగా తప్పించుకుంటారు. ఈ పర్యవసానాల వల్ల న్యాయ వ్యవస్థ పట్ల విశ్వసనీయత లోపించి, రాజ్యంపై పౌరులకుండాల్సిన నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతుంది.

(ఇంకా వుంది)

"మెదడు ఆరోగ్యం : అందరికీ అందుబాటులో" అనే ఇతివృత్తంతో న్యూరాలజిస్టులు అందించిన సూచనలు:

1. బాల్యం (ఆరోగ్యకరమైన మెదడు నిర్మాణం)

మొదటి ఐదేళ్ల వయస్సు మెదడు వికాసానికి అత్యంత కీలకమైనది. పౌష్టికాహారం, నిద్ర, ఆటలు, పిల్లలతో మాట్లాడటం/ కథలు చెప్పడం వల్ల నాడుల అనుసంధానం బలపడుతుంది.

స్క్రీన్ టైమ్ ప్రమాదం : అధిక టీవీ, మొబైల్ వాడకం వల్ల మాటలు ఆలస్యం కావడం, దృష్టి నిలపలేకపోవడం, నిద్రలేమి వంటి సమస్యలొస్తాయి.

లక్షణాలు : మాటలు రాకపోవడం, చూపు కలపకపోవడం (Eye contact) వంటివి గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

2. యువత- ఉద్యోగులు (అతిగా పనిచేసే మెదడు)

ఒత్తిడి- నిద్రలేమి : నిరంతర ఒత్తిడి, నిద్రలేమి వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గి మెదడు అలసిపోతుంది (బ్రెయిన్ ఫాగ్).

ఆరోగ్య సూత్రాలు : నిద్రలోనే మెదడు వ్యర్థాలను శుభ్రపరుచుకుంటుంది. తగినంత నిద్ర, శారీరక శ్రమ, వేళకు పౌష్టికాహారం తీసుకోవాలి.

స్ట్రోక్ నివారణ : బీపీ, షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడం వల్ల భవిష్యత్తులో స్ట్రోక్ (పక్షవాతం) ప్రమాదాన్ని నివారించవచ్చు.

3. వృద్ధాప్యం (డిమెన్షియా- జాగ్రత్తలు)

మతిమరుపు వృద్ధాప్య సహజ లక్షణం కాదు : వయసుతో పాటు చిన్న విషయాలు మరచిపోవడం సహజమే అయినా, 'డిమెన్షియా'వంటి తీవ్ర మతిమరుపు వ్యాధులు వృద్ధాప్యంలో సాధారణ భాగం కావు.

హెచ్చరిక సంకేతాలు : ఒకే ప్రశ్నను పదే పదే అడగడం, అలవాటైన ప్రదేశాల్లో దారి తప్పడం, ప్రవర్తనలో మార్పులు రావడం వంటివి కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.

కుటుంబ సభ్యుల పాత్ర : డిమెన్షియా, పార్కిన్సన్స్, స్ట్రోక్ వంటి సమస్యల ముందస్తు సంకేతాలను గుర్తించి సరైన సమయంలో వైద్యం అందించడంలో కుటుంబ సభ్యుల పాత్ర కీలకం.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మనం ఒక వింతైన వైరుధ్యాల వలయంలో జీవిస్తున్నాం. చరిత్రలో ఎన్నడూ లేనంతగా మనుషులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి ఇవాళ వేలాది మార్గాలు ఉన్నాయి. భూగోళం అంతటా విస్తరించిన నెట్‌వర్క్‌లు, క్షణాల్లో చేరిపోయే సందేశాలు, అరచేతిలోనే ప్రపంచాన్ని చూపే స్మార్ట్‌ఫోన్లు... ఇంత వేగంగా, ఇంత తరచుగా మనం ఒకరినొకరు సంప్రదించగలగడం మానవ చరిత్రలోనే ముందెన్నడూ జరగలేదు.

కానీ, ఈ మాటల మహా ప్రవాహం వెనుక, ప్రతి గుండెలోనూ ఒక నిశ్శబ్ద వేదన దాగి ఉంది. నిరంతరం మోగుతున్న నోటిఫికేషన్ల శబ్దాల మధ్య ఒక సన్నని అలసట వినిపిస్తూనే ఉంది:

“ఇన్ని మాటలు నడుస్తున్నా... నేను చెప్పేది వినేవారే లేరు!”

అవును, అభిప్రాయాలు సెకన్లలో ప్రపంచాన్ని చుట్టేస్తున్నాయి. ఫోన్లు, పాడ్‌కాస్ట్‌లు, జూమ్ మీటింగ్‌లు, సోషల్ మీడియా రీల్స్... ఇరవై నాలుగు గంటలూ ఏదో ఒక సంభాషణ సాగుతూనే ఉంది. కానీ, ఈ కమ్యూనికేషన్ సమృద్ధి వెనుక ఒక తెలియని ఒంటరితనం, ఒక లోతైన దూరం విస్తరిస్తోంది.

మనుషులు ఇవాళ తమ జీవిత భాగస్వామి చేత తప్పుగా అర్థం చేసుకోబడుతున్నట్లు, కన్న తల్లిదండ్రుల చేత నిర్లక్ష్యం చేయబడు తున్నట్లు, తాము పెంచిన పిల్లల చేత విస్మరించబడుతున్నట్లు, ఆఫీసుల్లో యజమానుల చేత పట్టించుకోబడనట్లు భావిస్తున్నారు.

సమస్య ప్రజలు మాట్లాడటం మానేయడం కాదు... బహుశా సమస్య ఏమిటంటే, మనం ‘వినడం’ మర్చిపోయాం!

వినకూడదని నేర్పుతున్న ఆధునిక కాలం

వినడం అనేది రోజురోజుకూ ఒక అరుదైన కళగా మారిపోతోంది. ఎందుకంటే నేటి ఆధునిక జీవనశైలి వినడానికి విరుద్ధమైన వాటికే అగ్రతాంబూలం ఇస్తోంది.

సోషల్ మీడియా మనల్ని ఆలోచనాత్మకమైన ప్రతిస్పందన వైపు కాకుండా, తక్షణ ప్రతిచర్యల (Reactions) వైపు నెడుతోంది. సమాజంలో జరిగే చర్చలు లోతైన అవగాహన కంటే, ఎవరు పదునైన సమాధానం ఇచ్చారనే దానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రతిదానికీ వేగాన్ని ఆశించే ఉత్పాదకత సంస్కృతి (Productivity culture) వల్ల, ఇద్దరు మనుషుల మధ్య జరిగే సంభాషణలు ఒకరినొకరు తెలుసుకునే అనుభవాలుగా కాకుండా, కేవలం ‘పరిష్కరించాల్సిన సమస్యలు’గా మిగిలిపోతున్నాయి.

నిజానికి, సాధారణ రోజువారీ సంభాషణల్లో కూడా మనలో చాలా మంది అవతలి వాడు చెప్పేది వినడం లేదు. కేవలం నిరీక్షిస్తున్నాం!

మన వంతు ఎప్పుడు వస్తుందా అని...మన సలహా ఎప్పుడు చెప్దామా అని... మన స్వంత డబ్బా ఎప్పుడు కొట్టుకుందామా అని... మనం ఎలా కరెక్టో నిరూపించడానికి ఎదురుచూస్తున్నాం. ఆ సంభాషణ పైకి ఇద్దరి మధ్య జరుగుతున్నట్లు అనిపించవచ్చు, కానీ మానసికంగా మాత్రం మనం మన అహం తోనే నిండి ఉంటాము. అందుకే, చాలా మంది సంభాషణ ముగిసిన తర్వాత తమకు ‘సమాధానం’ దొరికిందని భావిస్తారు కానీ, తాము ‘అర్థం చేసుకోబడ్డామని’ అనుకోరు.

స్పందించడం వేరు... అర్థం చేసుకోవడం వేరు!

కమ్యూనికేషన్ నిపుణులు ఒక అద్భుతమైన మాట చెబుతారు: “చాలా బంధాలు ప్రజల మధ్య భేదాభిప్రాయాల వల్ల ముక్కలు కావు. అవతలి వారిని అర్థం చేసుకోవడం కోసం కాకుండా, తాము మాట్లాడే సందు కోసం వినడం వల్ల విఫలమవుతాయి.”

ఈ వ్యత్యాసం చాలా సూక్ష్మంగా అనిపించవచ్చు, కానీ ఇది బంధాల దిశను మార్చేస్తుంది.

మనం కేవలం సమాధానం చెప్పడం కోసమే విన్నప్పుడు, మన

దృష్టి మనపైనే ఉంటుంది. అవతలి వ్యక్తి మాట్లాడుతుండగానే మనం అంచనాలు వేస్తాం, పోల్చి చూస్తాం, విశ్లేషిస్తాం.

కానీ, మనం నిజంగా అర్థం చేసుకోవడం కోసం విన్నప్పుడు, మనల్ని మనం కాసేపు పక్కన పెడతాం. మన స్వంత ఆలోచనల ముసుగును తొలగించి, అవతలి వ్యక్తి హృదయంలోకి ఎంతో ఆరాటంగా, ఆసక్తిగా తొంగిచూస్తాం. దీనికి కేవలం శ్రద్ధ ఉంటే సరిపోదు, అపారమైన 'వినయం' కావాలి. తనను తాను మాత్రమే నిరంతరం ప్రదర్శించుకోవాలని చూసే నేటి సమాజంలో ఆ వినయమే కరువైంది.

అర్థం చేసుకోబడాలనే ఆరాటం

మానవుడి అత్యంత లోతైన అవసరాలలో ఒకటి కేవలం ప్రేమించ బడటం మాత్రమే కాదు... అది అర్థం చేసుకోబడటం.

చాలా మంది విమర్శలను భరించగలరు, భేదాభిప్రాయాలను తట్టుకోగలరు. కానీ వారు తట్టుకోలేనిది– తమ ఆలోచనలు, తమ బాధలు అవతలి వ్యక్తి హృదయానికి చేరడం లేదు అనే శూన్యతను.

➢ భార్య లేదా భర్త రోజంతా పడిన అలసటను పంచుకుంటే, అక్కడ లభించేది సానుభూతి కాదు... తక్షణ 'పరిష్కారాలు'.

➢ ఒక నవయువకుడు తన మనసులోని ఆందోళనను పంచు కుంటే, పెద్దల నుండి లభించేది ఆదరణ కాదు..పెద్ద పెద్ద 'ఉపన్యాసాలు'.

➢ తీవ్రమైన దుఃఖంలో ఉన్న ఒక స్నేహితుడు తన పెయిన్‌ని వ్యక్తపరిస్తే, ఓదార్చడానికి బదులు మనకు ఎదురైన 'పోలికల' కథలు చెప్తాం.

ఈ ప్రతి సందర్భంలోనూ మాటల మార్పిడి అయితే జరిగింది, కానీ బంధం (Connection) ఏర్పడలేదు. కాలక్రమేణా, ప్రజలు తమ భావాలను పంచుకోవడం మానేస్తారు. అది వారికి చెప్పడానికి ఏమీ లేక కాదు, అవతలి వైపు వినే హృదయం లేదనే నమ్మకం ఏర్పడటం వల్ల!

కనుమరుగవుతున్న కరుణ

ఇస్లామిక్ సైకాలజీతో పాటు అనేక ఆధ్యాత్మిక కోణాలు వినడాన్ని కేవలం ఒక కమ్యూనికేషన్ నైపుణ్యంగా చూడవు; దాన్ని హృదయానికి సంబంధించిన విషయంగా చెప్తాయి. పవిత్ర గ్రంథాలు హృదయపూర్వకంగా, వివేచనతో వినేవారిని ప్రశంసిస్తాయి. వినడం అనేది నిష్క్రియంగా కూర్చోవడం కాదు, అది జ్ఞానానికి, అంతర్మథ నానికి ఒక రహదారి.

వినడానికి అతిపెద్ద శత్రువు మనలోని 'అహం' (ఈగో). ఆ అహం ఎప్పుడూ తానే మాట్లాడాలని, తానే కేంద్ర బిందువుగా ఉండాలని కోరుకుంటుంది. వినడం అనేది ఆ అహాన్ని కాసేపు నిశ్శబ్దం చేయమని అడుగుతుంది. కొద్ది క్షణాల పాటు, మన స్వంత ఉనికి కంటే అవతలి వ్యక్తి అనుభవం మనకు ముఖ్యమైనదిగా మారడమే నిజమైన శ్రోత లక్షణం.

అందుకే శ్రద్ధగా వినడం అనేది ఒక కరుణ, ఒక నిశ్శబ్ద ప్రార్థన. ఇది అవతలి వ్యక్తికి వారి అనుభవాలు, వారి పోరాటాలు... చివరికి 'వారు' ఈ ప్రపంచానికి ముఖ్యమే అనే భరోసాను ఇస్తుంది.

వినకపోతే... విలువల క్షీణత

రోగులు స్థిరంగా చెప్పే ఒక మాట ఏంటంటే– వైద్యులు తమ మాటలను ఓపిగ్గా విన్నప్పుడే సగం రోగం నయమవుతుందని. ఆఫీసుల్లో, క్లాస్‌రూమ్‌లలో, సమాజంలో... ఎక్కడైనా తమ మాట వినే నాయకుడిని ప్రజలు ప్రాణం కంటే ఎక్కువగా నమ్ముతారు.

వినడం అనేది కరువైనప్పుడు సమాజాలు ముక్కలవుతాయి. సంభాషణలు కేకలుగా మారుతాయి, కానీ వాటికి అర్థం ఉండదు. మనుషులు తమ అభిప్రాయాలతో ఏకీభవించే వారి గ్రూపుల్లోకి మాత్రమే ముడుచుకుపోతారు. భేదాభిప్రాయాలు శత్రుత్వాలుగా, వ్యత్యాసాలు ముప్పుగా మారుతాయి. వినే సామర్థ్యాన్ని కోల్పోయే సమాజం చివరికి తనను తాను అర్థం చేసుకునే విచక్షణను కోల్పోతుంది.

మరి మనమేం చేద్దాం?

మంచి శ్రోతగా మారడానికి ఎలాంటి పెద్ద పెద్ద కోర్సులు అవసరం లేదు. అది ప్రస్తుతం ఆ క్షణంలో పూర్తిగా నిలబడటంతో ప్రారంభమవుతుంది.

❖ అవతలి వాడు మాట్లాడుతుంటే మధ్యలో అడ్డుపడాలనే తొందరను అణచుకోవాలి.

❖ సలహాలు ఇచ్చే ముందు, అసలు వాళ్ళు ఏం చెప్పాలను కుంటు న్నారో ప్రశ్నలు అడిగి తెలుసుకోవాలి.

❖ నిశ్శబ్దాన్ని భరించడం నేర్చుకోవాలి.

❖ అన్నింటికంటే ముఖ్యంగా, అర్థం చేసుకోవడం అంటే ఏకీభవించడం కాదని గుర్తించాలి. మనం ఒకరి అభిప్రాయంతో విభేదించినా, వారికి "నీ మాట నేను విన్నాను" అనే గౌరవాన్ని ఇవ్వచ్చు.

సాంకేతికత ఎంత పెరిగినా, మనుషులు ఇవాళ కూడా చాలా సరళమైన దాని కోసం ఆకలితో ఉన్నారు. తాము జడ్జ్ చేయబడమనే నమ్మకం ఉన్న ఒక సంభాషణ... తమను తాము సమర్థించుకోవా ల్సిన అవసరం లేని ఒక ప్రశాంత స్థలం... పూర్తిగా తమ కోసమే కేటాయించిన ఒక శ్రోత.

మాట్లాడటాన్ని, వాదించడాన్ని జరుపుకునే ఈ సమాజంలో, 'వినడం' అనేది చాలా సాధారణమైనదిగా అనిపించవచ్చు. అయినప్పటికీ, మనం మరొక మనిషికి ఇవ్వగల అత్యంత విలువైన కానుక అది. ఎందుకంటే కొన్నిసార్లు మనుషులకు పరిష్కారాలు, సలహాలు, సమాధానాలు ఏవీ వద్దు... కేవలం తమ బాధను పంచుకోవడానికి, వినడానికి ఇష్టపడే ఒక తోడు కావాలి.

ప్రతి ఒక్కరూ తాము కనబడాలని, వినబడాలని ఆరాటపడుతున్న ఈ ప్రపంచంలో, మరొక వ్యక్తిని వినడం కంటే గొప్ప సేవ ఏముంటుంది? ఇవాళ మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సింది ఒకటి మాత్రమే...

మన జీవితంలో ఎవరికి మన సలహాలు, సవరణలు అవసరం లేదు... కేవలం మన శ్రద్ధ, మన నిశ్శబ్ద వినికిడి మాత్రమే అవసరం. ఒకసారి ఆలోచిద్దామా!

అవినీతి అంటే లంచం తీసుకోవడం, మోసం చేయడం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం. ఇది దేశ ప్రగతిని కుంటుపరుస్తుంది. అవినీతిపరుల చేతుల్లో ధనం కేంద్రీకృతమవడం వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టడం వలన రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలు ప్రజలకు సరిగ్గా అందవు. లంచాలు, సిఫార్సుల కారణంగా అర్హత లేని వారికి ఉద్యోగాలు దక్కి, ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఫలితంగా సమాజంలో నిజాయితీ క్షీణించి, అబద్ధాలు, మోసాలు అలవాటుగా మారిపోతాయి.

ఈ సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి ఇస్లాం ధర్మం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

"ఆయనే నిరక్షరాస్యులైన జనులలో- స్వయంగా వారిలోనుంచే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతడు వారికి అల్లాహ్ వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, వారిని పరిశుద్ధపరుస్తున్నాడు, వారికి గ్రంథాన్నీ, వివేకాన్ని బోధిస్తున్నాడు. అంతకు ముందు వారు స్పష్టమైన మార్గవిహీనతకు లోనై ఉండేవారు." (అల్-జుముఅహ్: 2)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) వారి సందేశం అణచివేతను, అక్రమాలను, అవినీతిని తీవ్రంగా నిషేధించింది. వాటి నిర్మూలన కోసం పోరాడాలని గట్టిగా నొక్కిచెప్పింది. ఈ విషయమై అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు:

"ప్రపంచంలో శాంతి, సామరస్యాలు ఏర్పడిన తర్వాత అరాచకం, అలజడులు సృష్టించకండి. భయంతో, ఆశతో మీరు అల్లాహ్‌ను మాత్రమే వేడుకోండి. ఆయన కారుణ్యం సద్వర్తనులకు అతి చేరువలోనే ఉంది." (అల్-ఆరాఫ్: 56)

ఈ ఆయత్‌లో నాలుగు ముఖ్యాంశాలు ఉన్నాయి:

అల్లాహ్‌ను కడు దీనాతిదీనంగా, ఆర్ద్రంగా, లోలోపలే మెల్లగా వేడుకోవాలి.

ప్రార్థన (దుఆ) చేసే సమయంలో మనిషి మితిమీరకూడదు. అసంభవమైన, అపసవ్యమైన విషయాలను కోరకూడదు.

సంస్కరణ జరిగిన తరువాత, ఒక సక్రమ వ్యవస్థ ఏర్పడిన తరువాత అరాచకాన్ని సృష్టించరాదు.

మనిషి దైవాగ్రహానికి ఎంతగా భయపడాలో, దైవానుగ్రహాల పట్ల అంతే ఆశాభావం కలిగి ఉండాలి.

మరొక చోట అల్లాహ్ ఇలా హెచ్చరించాడు: "అధికారం లభించగానే ప్రపంచంలో కల్లోలాల వ్యాప్తికి, పంట పొలాల విధ్వంసానికి, మానవ వినాశానికే వారు సదా ప్రయత్నిస్తారు. దేవుడు కలహాలు, కల్లోలాలు, విధ్వంసం, వినాశాలను ఎంతమాత్రం సహించడు. దేవునికి భయపడండని అంటే వారి అహంకారం వారిని మరింత పాపకూపంలోకి నెట్టివేస్తుంది. అలాంటి వారికి నరకమే తగిన శిక్షాస్థలం." (సూరహ్ అల్-బఖరహ్: 205-206)

ప్రముఖ ఖుర్ఆన్ వ్యాఖ్యాత ఇమామ్ ముజాహిద్ ఈ ఆయత్ గురించి వివరిస్తూ- మనుషులు భూమిపై పాపాలు, అవినీతిని వ్యాపింపజేసినప్పుడు, అల్లాహ్ వర్షాన్ని నిలిపివేస్తాడని, తద్వారా కరువు వచ్చి పంటలు, జీవరాశులు నశించిపోతాయని పేర్కొన్నారు.

అల్లాహ్ భూమిపై అలజడులు సృష్టించడాన్ని తీవ్రంగా ఖండించాడు. ప్రాణనష్టం కలిగించడం, వంశపారంపర్యాన్ని పాడు చేయడం, సంపదలను ధ్వంసం చేయడం, బుద్ధి విచక్షణను విచ్ఛిన్నం చేయడం వంటి పనులను అత్యంత ఘోరమైన మహాపాపాలుగా (కబాయిరుల్ ఆసామ్) పరిగణించాడు.

"అల్లాహ్‌తో గట్టి ప్రమాణం చేసి దాన్ని ఉల్లంఘించేవారు, అల్లాహ్ స్థిరంగా ఉంచాలని ఆదేశించిన సంబంధాలను విచ్ఛిన్నం చేసేవారు, ప్రపంచంలో కల్లోలాలు సృష్టించేవారు శాపగ్రస్తులవుతారు. వారి కోసం పరలోకంలో పరమ చెడ్డ నివాసం ఎదురు చూస్తోంది." (సూరహ్ అర్-రాద్: 25)

లంచగొండితనం- ఒక సామాజిక మహమ్మారి

ఆర్థిక అవినీతి దారుణమైన రూపాలలో 'లంచం' ఒకటి. ఏ సమాజంలోనైతే లంచగొండితనం వ్యాపిస్తుందో, అది వ్యక్తుల మనస్సాక్షులను కలుషితం చేసి, పరస్పర నమ్మకాన్ని పూర్తిగా ఆర్పివేస్తుంది. పూర్వం యూదుల దుర్గుణాలను ప్రస్తావిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"వీరు చెవియొగ్గి అబద్ధాలు వినేవారు, నిషిద్ధమైన (హరామ్) సొమ్ము చాలా ఎక్కువగా తినేవారు." (అల్-మాయిదా: 42)

హదీస్‌లో ఇలా ఉంది: "లంచం ఇచ్చేవాడిని, లంచం తీసుకునే వాడిని దైవప్రవక్త శపించారు." (అబూ దావూద్, తిర్మిజి)

ఈ రోజుల్లో లంచగొండితనానికి 'బహుమతులు' వంటి రకరకాల ముసుగులు వేస్తున్నారు. జకాత్ వసూలు చేయడానికి వెళ్ళిన ఒక అధికారి తనకు వచ్చిన వ్యక్తిగత బహుమతుల గురించి ప్రస్తావించినప్పుడు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) తీవ్ర ఆగ్రహంతో ఇలా అన్నారు:

"ఒకవేళ అతను తన తల్లిదండ్రుల ఇంట్లోనే కూర్చుని ఉంటే, అతనికి ఈ బహుమతులు వచ్చేవా లేదో చూసుకోవాలి! నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ అల్లాహ్ సాక్షిగా! మీలో ఎవరైనా సరే అధికార దుర్వినియోగం ద్వారా లంచంగా ఏ చిన్న వస్తువు తీసుకున్నా, ప్రళయ దినాన దానిని తన మెడపై మోసుకుంటూ అల్లాహ్ సముఖంలో హాజరుకావలసి వస్తుంది." (ముత్తఫఖున్ అలైహి)

లంచగొండితనానికి గల కారణాలు- నివారణ:

మనుషులలో పెరిగిన అత్యాశ, చట్టాల అమలులో అలసత్వం, నైతిక విలువల పతనం, ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకత లోపించడం వల్ల లంచం పెరిగిపోతోంది. సాంకేతికత వినియోగం (Digitalization) ద్వారా మధ్యవర్తుల పాత్రను తగ్గించడం, కఠినమైన శిక్షలు అమలు చేయడం, పాఠశాల స్థాయి నుంచే నైతిక విద్యా బోధన అందించడం, ప్రజలలో చైతన్యం తీసుకురావడం ద్వారా దీనిని అరికట్టవచ్చు.

మోసం, దగా

నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి అవతలి వ్యక్తిని నిలువునా ముంచడాన్నే మోసం లేదా దగా అంటారు. అల్లాహ్ సెలవిచ్చాడు:

"మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా తినకండి."
(సూరహ్ అల్-బఖరహ్: 188)

తూకాల్లో మోసం చేసేవారిని హెచ్చరిస్తూ ఖుర్ఆన్ ఇలా అంటోంది:

"కొలతలు, తూనికల్లో తగ్గించి ఇచ్చేవారు నాశనమవుదురుగాక! వారు ప్రజల నుండి కొలిచి తీసుకునేటప్పుడు మాత్రం పూర్తిగా తీసుకుంటారు. కానీ వారికి కొలిచిగానీ, తూకం వేసిగానీ ఇచ్చేటప్పుడు మాత్రం తగ్గించి ఇస్తారు. ఏమిటి, తాము మరణానంతరం ఒక మహాదినాన తిరిగి లేపబడతామన్న ఆలోచన వారికి బొత్తిగా లేదా?" (సూరహ్ అల్-ముతఫ్ఫిఫీన్: 1-6)

ఒక ముస్లిం నిజమైన విశ్వాసం (ఈమాన్) కలిగి ఉంటే అతను ఎప్పటికీ మోసానికి పాల్పడడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) బజారులో ఒక తడి ధాన్యపు రాశిని చూసి, వ్యాపారితో ఇలా అన్నారు:

"గుర్తుంచుకో! మమ్మల్ని మోసం చేసేవాడు నా సమాజానికి చెందినవాడు కాడు." (సహీహ్ ముస్లిం)

అంతేకాకుండా, మోసం చేయడం అనేది 'మునాఫిఖ్' (కపట విశ్వాసి) ముఖ్య లక్షణం. మాట్లాడితే అబద్ధం చెప్పడం, వాగ్దాన భంగం చేయడం, అప్పగించిన అమానతును మోసం చేయడం కపటత్వానికి నిదర్శనాలు.

శ్రేష్ఠ సమాజం యొక్క బాధ్యత

ఈ ముస్లిం సముదాయం 'ఉత్తమ సమాజం' (ఖైరే ఉమ్మత్) అనే గౌరవాన్ని కేవలం జనాభా ఆధిక్యత వల్లనో, వనరుల బలం వల్లనో సంపాదించుకోలేదు. మంచిని ఆజ్ఞాపించడం, చెడును నిరోధించడం ద్వారానే ఈ ఘనతను సాధించింది:

"మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు. మీరు మంచి విషయాలను ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు..." (సూరహ్ ఆలి ఇమ్రాన్: 110)

సమాజంలో చెడును చూసి విముఖత చూపడం లేదా దానిని అడ్డుకోకపోవడం అనేది కేవలం కొందరికే పరిమితమైన ఛాయిస్ కాదు; అది సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉన్న విధి. ఒకవేళ అవినీతిపరులు సమాజమనే ఓడకు రంధ్రం చేయడానికి ప్రయత్నించినప్పుడు, సంస్కర్తలు, బుద్ధిజీవులు మౌనంగా ఉండిపోతే ఆ ఓడ మునిగిపోవడం ఖాయం. కాబట్టి, అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలవలసి ఉంది.

నేటి ఆధునిక ప్రపంచంలో మానవ సంబంధాలు ఎంతో సున్నితంగా, అదే సమయంలో మరెంతో సంక్లిష్టంగా మారిపోతున్నాయి. పైకి చూస్తే అంతా సవ్యంగానే ఉన్నట్టు కనిపిస్తుంది కానీ, అంతర్గతంగా మాత్రం ఏదో తెలియని అలజడి. నిత్య జీవితంలో మనకు ఎంతోమంది ఆందోళన (anxiety), మానసిక అలసట (burnout), బంధాలలో ఏర్పడే అగాధాలతో సతమతమవుతూ కనిపిస్తూ ఉంటారు. అయితే, పైకి కనిపించే ఈ మానసిక సవాళ్లన్నింటి వెనుక ఒక లోతైన, నిగూఢమైన సమస్య దాగి ఉంది.
అదే– తీవ్ర ఆగ్రహం!

సాధారణంగా ఎవరూ తమకు "కోపం ఎక్కువ" అని సమాజం ముందు ఒప్పుకోరు. కానీ దైనందిన జీవితంలోని చిన్న చిన్న సంఘటనలను గమనిస్తే ఈ సత్యం స్పష్టమవుతుంది. "పాప ఏదో చిన్న స్నాక్స్ అడిగితే ఒక్కసారిగా ఆమెపై అరిచేశాను," అనో, లేక "హోటల్‌లో వెయిటర్ పొరపాటున కొద్దిగా జ్యూస్ కింద పడేస్తే తట్టుకోలేక గట్టిగా కేకలు వేశాను" అనో ఆవేదన చెందేవారు మనకు నిత్యం కనిపిస్తూనే ఉంటారు. తీవ్రమైన కోప ప్రదర్శనలు కొన్నిసార్లు మానసిక అనారోగ్య లక్షణాలు కావచ్చు, కానీ నిత్య జీవితంలో పిల్లలు, సహోద్యోగులు, స్నేహితులు లేదా దారిపోయే వారిపై చూపిస్తున్న సాధారణ కోపమే నేడు పెద్ద సమస్యగా మారుతోంది. నేడు ప్రజలు తమ కోపాన్ని నియంత్రించుకోలేకపోతున్నారు. చాలాసార్లు వారి స్పందన ఆ పరిస్థితితో పోలిస్తే ఎంతో అతిగా ఉంటోంది. ఈ సామాజిక రుగ్మతను మనస్తత్వ సూత్రాలు, పవిత్ర ఖురాన్ అందించిన ఉన్నతమైన పారమార్థిక దృక్పథంతో విశ్లేషించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక చిన్న ఉదాహరణను పరిశీలిస్తే... ఒక తల్లి, ఇంట్లో ఒక పూలకుండీ పొరపాటున కిందపడి పగిలిపోయినప్పుడు ఆ బిడ్డపై తల్లి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ క్షణికావేశం తీరిన తర్వాత, అలా ప్రవర్తించినందుకు ఆమె తీవ్రమైన నేరభావనతో (guilt) బాత్రూమ్‌లోకి వెళ్లి ఒంటరిగా ఏడ్చింది. ఆమె అన్న మాటలు ఆలోచింపజేసేలా ఉన్నాయి: "నేను ఇలాంటిదాన్ని కాను. సాధారణంగా నేను నన్ను అదుపులో ఉంచుకోగలను."

ఇక్కడ మనం ఒక గంభీరమైన సత్యాన్ని గ్రహించాలి: ఈ వ్యక్తులు పుట్టుకతోనే ఆవేశ స్వభావం కలవారు కాదు. వారు తీవ్రమైన అలసట, మానసిక ఒత్తిడి, మితిమీరిన ఉత్తేజానికి గురైన నాడీ వ్యవస్థతో జీవిస్తున్నారు. నేటి సమాజంలో ప్రజలు త్వరగా కోపపడుతున్నారు, కానీ క్షమించడానికి చాలా సమయం తీసుకుంటున్నారు. కాబట్టి, కోపం పెరుగుతోందా లేదా అనేది

ఇక్కడ ప్రశ్న కాదు. అసలు ప్రశ్న ఏంటంటే: ఈ సమాజం ఇంతలా సహనాన్ని ఎందుకు కోల్పోతోంది?

మానసిక సమతుల్యత

ఇక్కడే మతం, మనస్తత్వశాస్త్రం (psychology) ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఇస్లాం తన తొలి బోధనల నుంచే కోపాన్ని కేవలం ఖండించాల్సిన వ్యక్తిగత పరాజయంగా భావించ లేదు. అదొక సహజమైన భావోద్వేగమని గుర్తిస్తూనే, దానిని నియంత్రించవలసిన బాధ్యతను గుర్తుచేసింది.

అబ్దుల్లా ఇబ్న్ మసూద్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక ప్రవచనంలో, ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రశ్నించారు:

"మీలో అసలైన బలశాలి లేదా మల్లయోధుడు అని ఎవరిని అంటారు?" ప్రజలు: "ఎవరినైతే ఇతరులు కుస్తీలో ఓడించలేరో అతడిని," అని సమాధానమిచ్చారు. అప్పుడు ప్రవక్త (స): "కాదు, కోపం వచ్చినప్పుడు తన్ను తాను అదుపులో ఉంచుకునేవాడే అసలైన బలశాలి." (సునన్ అబూ దావూద్, 4779)

కోపం మరింత పెరగకముందే దానిని అదుపు చేయడానికి ఇస్లాం ఎంతో ఆచరణాత్మకమైన, భౌతికమైన పద్ధతులను బోధించింది. అబూ జర్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖన ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"మీలో ఎవరికైనా కోపం వచ్చినప్పుడు అతడు నిలబడి ఉంటే, కూర్చోవాలి. ఒకవేళ కోపం తగ్గితే సరే, లేదంటే అతడు పడుకోవాలి." (సునన్ అబూ దావూద్, 4782)

ఆధునిక ప్రవర్తనా శాస్త్రం (behavioral science) ఆవిర్భ వించడానికి శతాబ్దాల ముందే ఈ సూత్రాలు బోధించబడ్డాయి.

మానవ శరీర తత్వాన్ని పరిశీలిస్తే, తీవ్ర ఒత్తిడి ఎదురైనప్పుడు శరీరం 'సింపథెటిక్ నాడీ వ్యవస్థను' (sympathetic nervous system) సక్రియం చేస్తుంది. ఒక వ్యక్తి సుదీర్ఘకాలం పాటు ఒత్తిడిలోనే జీవిస్తున్నప్పుడు, ఈ వ్యవస్థ తిరిగి సాధారణ స్థితికి రాలేకపోతుంది. ఒత్తిడి హార్మోన్లు శరీరం లో అలాగే ఉండిపోవడం వల్ల, మెదడు ఆలోచించే సామర్థ్యం, ఆవేశాన్ని నియంత్రించుకునే శక్తి క్షీణిస్తాయి. సరళంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి ఇప్పటికే తీవ్ర మానసిక భారం కింద ఉన్నప్పుడు, ఒక చిన్న కారణం కూడా అతడిని కోపంతో ఊగిపోయేలా చేయడానికి సరిపోతుంది.

తమ భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోవడం వల్ల చాలా మంది తీవ్రమైన అవమాన భారానికి, నేరభావనకు లోనవుతారు. కానీ అవమాన భారం లేదా సిగ్గుపడటం అనేది సమస్యకు పరిష్కారం కాదు. నిజానికి, ఇది కోపాన్ని మరింత పెంచుతుంది. ప్రజలకు కావాల్సింది నిందలు కాదు; వారి అంతర్గత నాడీ వ్యవస్థలపై అవగాహన, తమను తాము ప్రశాంతంగా ఉంచుకోవడానికి అవసరమైన ఆచరణాత్మక వ్యూహాలు.

కట్టిపడేస్తున్న ఆధునిక ప్రపంచం

ఈ నిరంతర ఒత్తిడికి మూలాలు ఎక్కడ ఉన్నాయి?

నేటి ఆధునిక జీవనశైలే దీనికి ప్రధాన కారణం. సోషల్ మీడియాలో ఇతరులు ప్రదర్శించే కృత్రిమమైన, కేవలం సంతోషకరమైన జీవితాలు తరచుగా మనలో పోలికలను, అసంతృప్తిని, ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తున్నాయి. నిద్రలేమి అనేది ఒక నిశ్శబ్ద మహమ్మారిలా మారింది. ఆర్థిక ఇబ్బందులు, ద్రవ్యోల్బణం (inflation) వంటి సమస్యలను మన మెదడు ఒక శారీరక ముప్పులాగే భావించి నిరంతరం అలర్ట్‌గా ఉంటోంది.

అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే, ఆధునిక జీవితం యొక్క వేగం మరొక ఎత్తు. నిరంతర నోటిఫికేషన్లు, ఆఫీస్ ఈమెయిళ్ళు, తక్షణ సమాధానాలు ఇవ్వాలనే ఒత్తిడి మనుషుల్లో ఓపికను పూర్తిగా హరిస్తున్నాయి- ఈ 'సహనం' (patience) గురించే ఖురాన్ పదేపదే నొక్కి చెప్పింది.

నేటి సమాజంలో 'నిశ్శబ్దం' కూడా కనుమరుగవుతోంది. ఫోన్ లేకుండా, టీవీ చూడకుండా, ప్రశాంతంగా ఒంటరిగా గడుపుతూ ఆత్మపరిశీలన చేసుకునే సమయం ఎవరికీ దొరకడం లేదు. నాడీ వ్యవస్థను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి నిశ్శబ్దం ఎంతగానో సహాయపడుతుంది.

అయితే, నిశ్శబ్దం అంటే సమాజానికి దూరం కావడం కాదు. ఇస్లాంలో సామూహిక జీవితానికి ఎంతో ప్రాధాన్యత ఇవ్వబడింది. సమాజంతో కలిసి నమాజ్ (సలాహ్) చదవడం, రోగులను పరా మర్శించడం, అంత్యక్రియల్లో పాల్గొనడం, పొరుగువారికి సహాయం చేయడం వంటివన్నీ సామాజిక బంధాలను బలపరుస్తాయి. మనుషులలో ఒంటరితనాన్ని పోగొట్టి ఒక రక్షణ కవచంలా నిలుస్తాయి.

వీధులపై 'రోడ్ రేజ్': ఒక సామూహిక అలసట

ఈ అంతర్గత అలసట కేవలం వ్యక్తులకే పరిమితం కాలేదు, ఇది సామాజిక స్థాయిలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు పాశ్చాత్య దేశాలకే పరిమితం అనుకున్న 'రోడ్ రేజ్' (రహదారులపై కోపం ప్రదర్శించడం) ఇప్పుడు మన వీధుల్లో సాధారణ సమస్యగా మారింది. అసభ్యకరమైన సైగలు చేయడం, దూకుడుగా వాహనాలు నడపడం, చిన్న విషయాలకే గొడవలకు దిగడం నిత్యకృత్యాలయ్యాయి.

ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఈ సంఘటనలు వ్యక్తిగత మైనవి కావు. ఆ వ్యక్తులు పుట్టుకతోనే

హింసను కోరుకునేవారు కాదు. నిజానికి, వారు తమ మనస్సులో మోస్తున్న తీవ్రమైన ఒత్తిడిని, దారిలో దొరికిన వేరొకరిపై చూపిస్తున్నారు. మనస్తత్వశాస్త్రంలో దీనిని 'డిస్‌ప్లేస్‌మెంట్' (Displacement - విస్థాపనం) అంటారు- అంటే ఒకరిపై ఉన్న కోపాన్ని లేదా నిరాశను, సంబంధం లేని మరొకరిపై చూపించడం.

ఏం చేయాలి?

కోపాన్ని సమర్థవంతంగా అదుపు చేయాలంటే, మూడు స్థాయిలలో పని చేయాల్సి ఉంటుంది:

శారీరక స్థాయి (Physiological Level): కోపం మొదట శారీరక మార్పుల (గుండె వేగం పెరగడం, కండరాలు బిగుసుకోవడం) ద్వారా వ్యక్తమవుతుంది. అందుకే కోపం వచ్చినప్పుడు కూర్చోవడం లేదా పడుకోవడం అనే ప్రవక్త గారి బోధన శరీరానికి తక్షణ విశ్రాంతినిచ్చి, కోపం పెరగకుండా ఆపుతుంది. అలాగే నెమ్మదిగా లోతుగా శ్వాస తీసుకోవడం (deep breathing) ద్వారా శరీరం ప్రశాంతపడుతుంది.

మానసిక స్థాయి (Cognitive Level): నిరాశ, అన్యాయం లేదా ముప్పు ఉందనే ఆలోచనల వల్ల కోపం పెరుగుతుంది. కాబట్టి, ఆ ముప్పు నిజమైనదా లేక కేవలం మన భ్రమనా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ప్రతికూల ఆలోచనల స్థానంలో వాస్తవిక ఆలోచనలను అలవాటు చేసుకోవాలి.

సామాజిక, డిజిటల్ స్థాయి (Social & Digital Level): మనుషులు ఇతరుల నుండి వేరుపడినట్లు భావించినప్పుడు కోపం పెరుగుతుంది. కాబట్టి నిజమైన మానవీయ సంబంధాలను పునరుద్ధరించుకోవాలి. అలాగే, మనం సోషల్ మీడియాలో ఎలాంటి సమాచారాన్ని చూస్తున్నామో గమనించుకోవాలి, ఆన్‌లైన్‌లో తెలియని వ్యక్తులపై స్పందించే ముందు ఒక్క క్షణం ఆగాలి.

కోపం అనే భావోద్వేగం అసలు సమస్య కాదు. నియంత్రణ లేని కోపం- ఇతరు లను తక్కువ చేసి చూపేది, మానవత్వాన్ని హరించేది, తనను తాను దహించివేసే కోపమే అసలైన సమస్య. అందువల్ల మనం కోపాన్ని అర్థం చేసుకోవాలి, పరస్పర సహానుభూతిని పెంపొందించుకోవాలి. మనం ప్రశాంతమైన, క్షమాగుణంతో కూడిన జీవన విధానాన్ని ఎంచుకోవాలి. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఎవరైతే తమ కోపాన్ని అణచుకుంటారో, ప్రజలను క్షమిస్తారో; అల్లాహ్ సత్కార్యాలు చేసేవారిని ప్రేమిస్తాడు." (ఖురాన్ - 3:134)

నేటి కలుషిత వాతావరణంలో ఈ మార్గాన్ని ఎంచుకోవడం మునుపటి కంటే ఎంతో కష్టంగా ఉండవచ్చు. కానీ ఇది ఇప్పుడు చాలా అవసరం. ఎందుకంటే, ఆవేశాన్ని జయించి ఆత్మనియంత్రణ సాధించడమే అన్నిటికంటే నిజమైన గంభీరమైన బలం.

ముహమ్మద్ వహీదుద్దీన్‌కు జాతీయ విద్యా గౌరవ పురస్కారం

సిద్ధిపేట పట్టణానికి చెందిన కవి, రచయిత, ఉపాధ్యాయుడు ముహమ్మద్ వహీదుద్దీన్‌కు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జులై 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేటర్స్ అవార్డు-2026 జాతీయ విద్యా గౌరవ పురస్కారం ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని ప్రముఖ సినీనటుడు డాక్టర్ పృధ్వీరాజ్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మనోహర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ముహమ్మద్ వహీదుద్దీన్ విద్యారంగంలో అందిస్తున్న సేవలతోపాటు సాహిత్య రంగంలో చేస్తున్న విశిష్ట కృషిని కొనియాడారు. విద్యార్థుల్లో విలువలతో కూడిన విద్యను పెంపొందించడంలో, సమాజంలో నైతిక విలువలను వ్యాప్తి చేయడంలో, తెలుగు సాహిత్య, ఇస్లామిక్ రచనల ద్వారా విశేష సేవలు అందిస్తున్నందుకే ఈ గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు స్వీకరించిన అనంతరం ముహమ్మద్ వహీదుద్దీన్ మాట్లాడుతూ.. ఈ గౌరవం తన ఒక్కరికే కాకుండా తనను ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహిత్య మిత్రులందరికీ చెందుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో మరింత అంకితభావంతో సేవలందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు, సాహితీవేత్తలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవకులు, ఉపాధ్యాయులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

"త్వరగా పడుకుని, త్వరగా లేవడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం, తెలివితేటలు వస్తాయి" అనే పాత సామెతను నేటి తరం పూర్తిగా మర్చిపోయింది. ముఖ్యంగా యువత అర్ధరాత్రి దాటినా ఫోన్ల స్క్రీన్‌లను స్క్రోల్ చేస్తూనే ఉంటోంది. మెదడుకు ఆ కిక్ (డోపమైన్) దొరికే వరకు నిద్రను వాయిదా వేయడం వల్ల మన నిద్ర అలవాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫలితంగా చాలా మంది ఎప్పుడూ అలసటగా, నీరసంగా కనిపి స్తున్నారు. వీటికి తోడు, కూర్చుని వెబ్ సిరీస్‌ల సీజన్లను మొత్తం చూసేసే 'బింజ్ వాచింగ్' అలవాటు యువతను నిద్రలేని తరంగా మారుస్తోంది. దీని ప్రభావం గుండె జబ్బులు, నిద్రలేమి (ఇన్సోమ్నియా), బీపీ, షుగర్ లెవెల్స్ పెరగడం రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది. సరిగ్గా నిద్ర లేకపోతే పనిలో ఉత్పాదకత తగ్గుతుంది, ఆలోచనా శక్తి మందగిస్తుంది, జీవితంలో సంతోషం కరువవుతుంది. ఇదొక డేంజర్ సైకిల్ లాంటిది. కెఫిన్ అలవాటు..

నిరంతర ఒత్తిడి!

కాఫీ, టీ లేదా ఎనర్జీ డ్రింక్స్ రూపంలో కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం కూడా నిద్ర చెడిపోవడానికి ఒక కారణం. చాలా మంది ఒక్క కప్పుతో ఆగకుండా, రోజంతా శరీరానికి కెఫిన్ ఇస్తూనే ఉంటారు. ఇది తాత్కాలికంగా చురుకుదనాన్ని ఇచ్చినప్పటికీ, ఎక్కువగా తీసు కోవడం వల్ల ఆందోళన, కంగారు, ఒళ్లు వణకడం, నిద్రపట్టక పోవడం లాంటి సమస్యలు వస్తాయి. మరోవైపు, ఆఫీసుల్లో నిరంతరం కష్టపడాలనే సంస్కృతి (హస్టిల్ కల్చర్) పెరిగిపోయింది. రోజుకు కావాల్సినంత సమయం నిద్రపోయే వారిని, పని పట్ల శ్రద్ధ లేని వారిలా చూసే ధోరణి కొన్ని చోట్ల కనిపిస్తోంది. మనుషులను యంత్రాల్లా భావించి, ఎప్పుడూ ఒకేలా పని చేయాలని ఆశించడం వల్లే యువ ఉద్యోగుల్లో 'బర్నౌట్' (తీవ్ర అలసట) ఎక్కువవుతోంది. మనసుపై ప్రభావం క్రమం లేని నిద్ర వేళలు మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయి. ఆందోళన, డిప్రెషన్ పెరగడానికి నిద్రలేమి ప్రధాన కారణం. మనదేశంలో చాలా మంది ఐటీ, ఇతర రంగాల ఉద్యోగులు రొటేషనల్ షిఫ్టుల్లో పని చేస్తున్నారు. రాత్రి పూట పని చేస్తూ, పగలు నిద్రపోతున్నారు. కంపెనీలకు ఇది అవసరమే అయినా, దీర్ఘకాలంలో వారి ఆరోగ్యానికి చాలా నష్టం జరుగుతోంది. దీనికి తోడు అర్ధరాత్రి వరకు సాగే లేట్ నైట్ పార్టీలు, ఫంక్షన్ల వల్ల కూడా నిద్ర దూరమవుతోంది. ఎక్కువ సమయం మేల్కొని ఉండటం వల్ల ఓవర్ థింకింగ్ (అతిగా ఆలోచించడం), మానసిక ఒత్తిడి పెరుగుతాయి.

మహిళలపై ఎక్కువ ఒత్తిడి!

ఇంటి పనులు, పిల్లల బాధ్యతలతో పాటు ఆఫీస్ పనులు కూడా చూసుకునే మహిళలే పురుషుల కంటే ఎక్కువ నిద్రలేమికి గురవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. హార్మోన్ల మార్పులు, శారీరక తత్వాల వల్ల మహిళలకే కొంచెం ఎక్కువ నిద్ర అవసరం. బ్రిటన్‌లోని లౌబరో యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం.. మహిళలకు పురుషుల కంటే కనీసం 20 నిమిషాలు ఎక్కువ నిద్ర కావాలి. ఎందుకంటే మహిళలు రోజంతా మల్టీటాస్కింగ్ (ఒకేసారి పలు పనులు) చేస్తూ మెదడును ఎక్కువగా ఉపయోగిస్తారు. కాబట్టి వారు కోలుకోవడానికి అదనపు నిద్ర అవసరం.

మంచి నిద్ర కోసం 4 చిట్కాలు:

పడుకోవడానికి గంట ముందే మొబైల్, టీవీ స్క్రీన్‌లకు దూరంగా ఉండాలి. పడుకునే ముందు కాసేపు ధ్యానం లేదా మనసును ప్రశాంతంగా ఉంచే వ్యాయామాలు చేయాలి. సాయంత్రం 5 గంటల తర్వాత కాఫీ, టీలు తాగకూడదు. పగటిపూట నిద్రపోవాలనుకుంటే 30 నిమిషాల కంటే ఎక్కువ సమయం పడుకోకూడదు.

చిన్న సూచన:

నిద్ర సమస్యలను అస్సలు లైట్ తీసుకోవద్దు. నిరంతరం నిద్రపట్టడం లేదంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ముందే జాగ్రత్త పడితే భవిష్యత్తులో వచ్చే పెద్ద పెద్ద అనారోగ్య సమస్యలను ఆపవచ్చు. వయసు, జెండర్, ఉద్యోగంతో సంబంధం లేకుండా నిద్ర అనేది అందరికీ ఒక బేసిక్ అవసరం. అది మన శరీరానికి, మనసుకు రీఛార్జ్ లాంటిది. ఎప్పుడూ బిజీగా ఉండటమే గొప్ప అనుకునే ఈ రోజుల్లో... నిద్రను 'వేస్ట్ టైమ్' అనుకోకుండా, మన ఆరోగ్యం కోసం చేసే ఒక మంచి 'ఇన్వెస్ట్‌మెంట్' (పెట్టుబడి) లాగా భావించాలి.

❖

యూనివర్సిటీ భవనాల కూల్చివేత నోటీసుపై ముస్లిం పర్సనల్ లా బోర్డ్ తీవ్ర ఆగ్రహం!

ముహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీకి చెందిన 38 భవనాలను కూల్చివేసేందుకు రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (RDA) ఇచ్చిన నోటీసుపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (AIMPLB) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఆజంఖాన్‌పై రాజకీయ కక్షసాధింపుతో పాటు ముస్లింల విద్యా పురోగతిని దెబ్బతీసే కుట్ర అని బోర్డు అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.క్యూ.ఆర్. ఇలియాస్ మండిపడ్డారు. భవనాల నిర్మాణ సమయంలో ఆ ప్రాంతం RDA పరిధిలోనే లేదని, కాబట్టి అనుమతుల ప్రశ్న ఉత్పన్నం కాదని స్పష్టం చేశారు. దేశ విద్యా సంపదను నాశనం చేసే ఈ ఏకపక్ష నిర్ణయాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, RDA వెంటనే వెనక్కి తీసుకోవాలని, సాంకేతిక లోపాలుంటే చర్చల ద్వారా పరిష్కరించుకుని వర్సిటీకి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈరాన్ ఆతిథ్యం అద్భుతం

ఈరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరై తిరిగి వచ్చిన 'భారతీయ సర్వ ధర్మ సంసద్' జాతీయ కన్వీనర్ గోస్వామి సుశీల్ జీ మహారాజ్ తన పర్యటనను జీవితంలో అత్యంత అద్భుతమైన అనుభవంగా అభివర్ణించారు. భారత ప్రభుత్వ అధికారిక ప్రతినిధిగా కాకుండా, మత సామరస్యాన్ని ఆకాంక్షించే ఆధ్యాత్మిక నాయకుల బృందంగా ఈరాన్ రాయబార కార్యాలయం ఆహ్వానం మేరకే తాము వెళ్లామని, అక్కడ తమకు అసాధారణమైన గౌరవం, ఆతిథ్యం లభించాయని ఆయన తెలిపారు. ఈరాన్ అధికారులు తమ బృందం కోసం ప్రత్యేకంగా చార్టర్డ్ విమానాన్ని ఏర్పాటు చేయడం వారి మతాంతర గౌరవానికి నిదర్శనమన్నారు. ఈరాన్ సమాజంపై అంతర్జాతీయంగా ఉన్న ప్రతికూల అంచనాలకు, క్షేత్రస్థాయి ప్రశాంత వాతావరణానికి చాలా తేడా ఉందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారతదేశ ఇంధన భద్రత, నౌకల రక్షణపై ఈరాన్ ప్రతినిధులతో మాట్లాడగా వారి నుండి సానుకూల హామీ లభించిందని వెల్లడించారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, గాజా సంక్షోభంపై స్పందిస్తూ- హింస, యుద్ధం దేనికీ పరిష్కారం కావని, కేవలం చర్చలు, 'వసుధైక కుటుంబం' అనే భావనతో కూడిన మానవత్వమే ప్రపంచంలో శాశ్వత శాంతిని తీసుకురాగలవని ఆయన పిలుపునిచ్చారు.

భారత్‌లో కొలెస్ట్రాల్ సంక్షోభం: ఐసీఎంఆర్ అధ్యయనం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ICMR-INDIAB) నిర్వహించిన జాతీయ అధ్యయనం ప్రకారం భారత్‌లో ప్రతి 10 మంది వయోజనుల్లో దాదాపు తొమ్మిది మంది (87.3%) రక్తంలో అసాధారణ కొవ్వుల (డైస్లిపిడెమియా) సమస్యతో బాధపడుతున్నారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా పురుషుల కంటే మహిళల్లో (91.1%) మరియు 30-39 ఏళ్ల చిన్న వయస్కుల్లోనే ఈ ముప్పు ఎక్కువగా కనిపిస్తోంది. సాధారణంగా ఆరోగ్యంగా కనిపించే 40% మందిలోనూ చెడు కొలెస్ట్రాల్ ఉండటం వల్ల గుండెపోటు, పక్షవాతం ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున, అందరూ క్రమం తప్పకుండా 'లిపిడ్ ప్రొఫైల్' పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అప్పుల ఊబిలో భారత్

రాజ్యసభలో ఎంపీ జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సమర్పించిన వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి రూ.100 కొత్త రుణం (అప్పు)లో సుమారు రూ.82 పాత అప్పుల వడ్డీల చెల్లింపులకే సరిపోతున్నదని వెల్లడైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కొత్త అప్పుల్లో వడ్డీ చెల్లింపుల వాటా 50.9 శాతంగా ఉండగా, 2025-26 నాటికి అది ఏకంగా 81.8 శాతానికి చేరుకుంది. దీనివల్ల కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల కోసం కేవలం 18 శాతం నిధులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని ఎంపీ విమర్శించారు. అయితే, రెవెన్యూ వసూళ్ల ద్వారా రుణ వడ్డీలను సమర్థవంతంగా చెల్లించగలుగుతున్నామని, తీసుకున్న రుణాలను మూలధన వ్యయం (ఆస్తుల సృష్టి) కోసం ఉపయోగిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ప్రస్తుతం దేశం ఉన్న మొత్తం అప్పుల్లో 95 శాతానికి పైగా స్వదేశీ రుణాలే కావడం గమనార్హం.

నెతన్యాహును అరెస్ట్ చేస్తామన్న న్యూయార్క్ మేయర్

సెప్టెంబరులో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల కోసం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు న్యూయార్క్‌కు వస్తే, ఆయనను అరెస్టు చేసే చట్టపరమైన అవకాశాలపై నగర న్యాయ విభాగాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు న్యూయార్క్ సిటీ మేయర్ జోహ్రాన్ మమ్దానీ స్పష్టం చేశారు. గాజాపై సైనిక చర్యలు, మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అంతర్జాతీయ నేరాల న్యాయ స్థానం (ICC) నెతన్యాహుపై జారీ చేసిన అరెస్ట్ వారెంట్‌ను ప్రస్తావిస్తూ... ''నెతన్యాహు 'ది హగ్' జైలులోనే ఉండాలి''అని మమ్దానీ వ్యాఖ్యానించారు. అయితే, ఒక నగర మేయర్‌కు అటువంటి అధికారాలు ఉంటాయా అనే సందేహాలపై స్పందిస్తూ, తమ యంత్రాంగం చట్ట పరిధిలోనే పనిచేస్తుందని ఆయన చెప్పారు. మరోవైపు, ఈ వ్యాఖ్యలను నెతన్యాహు తోసిపుచ్చుతూ మమ్దానీ ''అమెరికాను ద్వేషిస్తున్నారని'' విమర్శించగా, ఎన్ని పిలుపులు వచ్చినా నెతన్యాహు ఐరాస సమావేశానికి హాజరవుతారని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. ఇదే సమయంలో, ఇజ్రాయెల్‌కు అమెరికా సహాయం అందించడాన్ని వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య డెమోక్రటిక్ ఓటర్లు, ప్రతినిధులలో గణనీయంగా పెరుగుతున్నట్లు ఇటీవల నిర్వహించిన సర్వేలు వెల్లడిస్తున్నాయి.

చైనాలో ఫుడ్ డెలివరీ రైడర్‌కు అత్యున్నత సాహిత్య పురస్కారం

చైనాలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వాంగ్ జిబింగ్(56) తన కవితా సంకలనానికి దేశంలో అత్యున్నత సాహిత్య పురస్కారమైన 'లు జిన్ లిటరసీ ప్రైజ్'ను గెలుచుకున్నారు. గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న కార్మికుల కష్టాలు, ఆశయాలు తదితర అంశాలపై ఆయన రచించిన 'లో ఫ్లైట్' అనే కవితా సంకలనానికి ఈ అవార్డు లభించింది. జియాంగ్సు ప్రావిన్స్‌కు చెందిన వాంగ్ జిబింగ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేశారు. గతంలో భవన నిర్మాణ పనులు, స్ట్రీట్ వాల్స్‌లో వస్తువులు అమ్మడం లాంటి పనులు చేశారు. 2019 నుంచి ఫుడ్ డెలివరీ రైడర్‌గానే పనిచేస్తూ, ఆర్డర్ల మధ్య విరామ సమయంలో చిన్న కాగితపు ముక్కలపై కవితలు రాసేవారు. 2022లో ఆయన రాసిన 'మ్యాన్ ఇన్ ఎ హర్రీ' కవిత సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చారు. 2023లో అదే పేరుతో కవితా సంకలనం ప్రచురితమయ్యింది. 2024లో ఆయన 'లో ఫ్లైట్' పుస్తకం కోసం సుమారు 200 మంది తోటి డెలివరీ రైడర్లను ఇంటర్వ్యూ చేసి, వారి జీవన పరిస్థితులను కవితలుగా మలిచారు. తాను అత్యున్నత సాహిత్య పురస్కారం అందుకున్నప్పటికీ డెలివరీ ఉద్యోగాన్ని విడిచిపెట్టనని వాంగ్ తెలిపారు.

బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్ ప్రమాణం

బ్రిటన్ ప్రధాన మంత్రిగా ఆండీ బర్న్‌హామ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో గత దశాబ్ద కాలంలో బ్రిటన్ ఏడవ ప్రధానిగా ఆయన నిలిచారు. ప్రధాని కార్యాలయం వెలుపల వీడ్కోలు ప్రసంగం అనంతరం కీర్ స్టార్మర్ లాంచనంగా రాజీనామా చేసి కింగ్ చార్లెస్‌కు తన రాజీనామాను సమర్పించిన తర్వాత గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ ఆండీ బర్న్‌హామ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, క్షీణిస్తున్న ప్రజాసేవలతో సహా ప్రజల దైనందిన జీవితాలపై ప్రభావం చూపే అంశాలకు తన ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని 56 ఏండ్ల బర్న్‌హామ్ తెలిపారు. బ్రిటన్ రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో భారీ సంస్కరణలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మందగించిన ఆర్థిక వృద్ధి, ఒత్తిడిలో ఉన్న ప్రజాసేవలు, కాలం చెల్లిన మౌలిక సదుపాయాలను బ్రిటన్ ఎదుర్కొంటున్న వేళ కొత్త ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

అండర్-15 పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్..

15 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయాలని ఫ్రాన్స్ భావిస్తున్నది. దీని కోసం బిల్లును రూపొందించారు. ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఆ బిల్లుపై చర్చ జరగనున్నది. సోషల్ మీడియా వినియోగంపై పిల్లల కోసం ప్రత్యేక ఆంక్షలు కూడా విధించే రీతిలో కొత్త బిల్లును రూపొందించారు. అయితే యురోపియన్ యూనియన్ చట్టాల ప్రకారం ఆ బిల్లును తయారీ చేసినట్లు ఫ్రాన్స్ చెబుతోంది. సెప్టెంబర్‌లో కొత్త వార్షిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో సోషల్ మీడియా బ్యాన్ అంశంలో ఫ్రాన్స్ పార్లమెంట్ ఆగమేఘాల మీద చట్టాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నది. నేషనల్ అసెంబ్లీతో పాటు సేనేట్ సభ్యులు ఆ బిల్లుపై ఇప్పటికే ముచ్చటించారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ అంశంపై అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ చాలా క్లారిటీతో ఉన్నారు. ఆ బిల్లును ఆయన సమర్థిస్తున్నారు. ఇక హై స్కూళ్లలో మొబైల్ ఫోన్లను బ్యాన్ చేయాలని కూడా మాక్రన్ భావిస్తున్నారు.

దానగుణం... స్వర్గానికి మార్గం!

- ముహమ్మద్ వహీదుద్దీన్

దానం అనేది కేవలం భౌతికమైన సంపదను ఇచ్చిపుచ్చుకోవడం కాదు; అది ఆత్మను పరిశుద్ధం చేసే అద్భుతమైన ఆరాధన. సమాజంలో తోటివారి ఆకలిని, అవసరాలను గుర్తించి స్పందించే గుణమే దాతృత్వం. ఇస్లామీయ పరిభాషలో అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం (ఇన్ఫాక్ ఫీ సబీలిల్లాహ్) పరలోక విజయానికి అత్యుత్తమ సాధనం.

దానానికి ప్రతిఫలం

అల్లాహ్ మార్గంలో ధనాన్ని వెచ్చించేవారి ఉపమానాన్ని దివ్య ఖుర్ఆన్ ఎంతో అందంగా వర్ణించింది. ఒక విత్తనాన్ని నాటితే అది మొలకెత్తి, ఏడు వెన్నులను ఈని, ప్రతి వెన్నులో నూరేసి గింజలు లభించినట్లుగానే... మనిషి చేసే ఒక్క సత్కార్యాన్ని అల్లాహ్ ఏడు వందల రెట్లు లేదా తాను కోరినంతగా వికసింప జేస్తాడు (ఖుర్ఆన్ 2:261).

అంతేకాకుండా, రోజువారీ జీవితంలో మనం చేసే దానం వెనుక దైవదూతల ప్రార్థనలు ఉంటాయని దైవప్రవక్త ముహమ్మద్ (స) ఉద్బోధించారు. ప్రతీ ఉదయం భూమిపైకి దిగివచ్చే ఇద్దరు దూతలలో ఒకరు "ప్రభూ! నీ మార్గంలో ఖర్చు చేసేవారికి శుభాలను, ఉత్తమ సంతానాన్ని అనుగ్రహించు" అని ఆశీర్వదిస్తే... మరొకరు "లోభత్వంతో దాచిపెట్టే పిసినారి సంపదను నాశనం చేయి" అని శపిస్తుంటారు (బుఖారీ, ముస్లిమ్).

దానం తెచ్చే దైవిక శుభాలు

సత్కార్యాల్లో దానానికి ఉన్న స్థానం అనన్యమైనది. హదీస్ (తిర్మిజీ) ప్రమాణాల ప్రకారం దానం వల్ల మానవాళికి అనేక ఆధ్యాత్మిక, లౌకిక ప్రయోజనాలు చేకూరుతాయి:

దైవాగ్రహానికి ఉపశమనం : మానవుడు తెలియక చేసే పొరపాట్ల వల్ల కలిగే దైవాగ్రహాన్ని దానం శాంతపరుస్తుంది.

ఉత్తమ ముగింపు : నికృష్టమైన, ఆకస్మికమైన మరణాల నుండి దానం మనిషిని రక్షిస్తుంది.

ఆయురారోగ్యాలు - నమ్రత : దానం చేయడం వల్ల ఆయుష్షు పెరుగుతుంది; మనస్సులోని గర్వం, అహంకారం సమసిపోయి నమ్రత అలవడుతుంది.

ముందుగా స్వర్గ ప్రవేశం : దానశీలురు స్వర్గంలోకి అందరికన్నా ముందుగా ప్రవేశించే అదృష్టాన్ని పొందుతారు.

నష్టం లేని వ్యాపారం

దివ్య ఖుర్ఆన్ చదివేవారు, నమాజ్ వ్యవస్థను నెలకొల్పేవారు, తమ సంపద నుండి రహస్యంగానూ, బహిరంగంగానూ దానం చేసేవారు అల్లాహ్‌తో "ఎప్పటికీ నష్టం రాని వ్యాపారం" చేస్తున్నారు (ఖుర్ఆన్ 35:29,30). రాత్రింబవళ్ళు అల్లాహ్ ప్రసన్నత కోసం ఖర్చు చేసేవారికి పరలోకంలో ఎలాంటి భయము కానీ, దుఃఖము కానీ ఉండవు.

అయితే, దానంలో అసలైన పరీక్ష త్యాగంలోనే ఉంది. "మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు సత్కార్య స్థాయిని చేరుకోలేరు" (ఖుర్ఆన్ 3:92) అని అల్లాహ్ స్పష్టం చేశాడు. తమకు అవసరం ఉన్నప్పటికీ, నిరుపేదల అవసరాలకే ప్రాధాన్యతనిచ్చే త్యాగధనులను, పిసినారితనం నుండి రక్షించబడిన వారిని ఖుర్ఆన్ విజేతలుగా అభివర్ణించింది.

(ఖుర్ఆన్ 59:9)

సంపద అనేది అల్లాహ్ మనకు ఇచ్చిన ఒక తాత్కాలిక అమానత్. దాన్ని దాచిపెట్టుకోవడంలో కాకుండా, సమాజ శ్రేయస్సుకు, పేదల ఆకలి తీర్చడానికి ఉపయోగించడంలోనే మానవజన్మ సార్థకత ఉంది. అల్లాహ్ మనందరికీ స్వార్థాన్ని విడనాడి, ఆయన మార్గంలో ధారాళంగా దానం చేసే సద్బుద్ధిని, సత్ప్రవర్తనను ప్రసాదించుగాక! ఆమీన్.

తు
ది
గే
టు

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**